ప్రజాశక్తి

బుధవారం 31 మే 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి







సివిల్స్ విజేతలను అభినందిస్తున్న అతిథులు, నిర్వాహకులు

సామాజిక స్పృహ కీలకం

- ప్రణాళికతో చదివితే సివిల్స్ సాధన సులువే..
- జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ
- అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన సివిల్స్ విజేతలకు సత్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత సామాజిక స్పృహ కలిగి ఉండాలని జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అన్నారు. మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సివిల్స్ పరీక్షలపై సెమినార్, సివిల్స్‌కు ఎంపికైన అభ్యర్థుల అభినందన సభ జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిగతా 2లో..

జలజీవన్ మిషన్‌కు నిధుల కొరత

- పనుల్లో కానరాని పురోగతి
- బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూపు
- ఉమ్మడి జిల్లాలో 6,228 పనులకు 2,356 పూర్తి
- రూ.935.47 కోట్లకు రూ.167.30 కోట్లు ఖర్చు
- మొదలుకాని 2,608 పనులు



ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

నిధులు జల లేకపోవడంతో జలజీవన్ మిషన్ పథకం నిట్టూరుస్తోంది. గ్రామీణ ప్రజలకు మంచినీరు అందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో చేపట్టాల్సిన పనులు నిధుల్లేక చతికిలపడుతున్నాయి. కాంట్రాక్టర్లకు పది నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో వారు కొత్త పనులు చేపట్టడంలేదు. ప్రారంభించిన పనులు వేగవంతం చేయడంలేదు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జలజీవన్ మిషన్ కింద రెట్రోఫిట్టింగ్ పనులు, ఆగ్మెంటషన్, పిడబ్ల్యుఎస్ పనులు, కొత్తపనులు వెరసి రూ.935.47 కోట్లతో 6228 చేపట్టాల్సివుంది. ఇంతవరకూ రూ.167.30 కోట్లు ఖర్చు చేసి 2356 పనులు పూర్తి చేయగా, 1260 పనులు వివిధ స్థాయిల్లో వున్నాయి. 2608 పనుల్లో కొన్ని అవసరంలేనివిగానూ, మరికొన్ని టెండర్ల దశలోనూ, ఇంకొన్ని టెండర్ల ప్రక్రియ పూర్తయినా మొదలు పెట్టని స్థితిలోనూ ఉన్నాయి. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో టెండర్లు జరిగిన పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించలేదు.

2024 నాటికి ప్రతి ఇంటికీ కుళాయి నీరు ఇవ్వాలన్న లక్ష్యం ప్రకారం జలజీవన్ మిషన్ కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో సగం నిధులను విడుదలచేసి మంచినీటి పథకాలను పూర్తిచేయాల్సివుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద ఇవ్వాల్సిన నిధులను విడుదల చేయడంలేదని కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులు ఇవ్వడం ఆపేసింది. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో జరగాల్సిన పనులకు ఆటంకాలేర్పడుతున్నాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అనుకున్నట్లు ముందుగా సాగడంలేదు. ప్రస్తుత విశాఖపట్నం జిల్లాలో 143 రెట్రోఫిట్టింగ్ పనులకు 63 పనులు, అనకాపల్లి జిల్లాలో 810 పనులకు 21, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు డివిజన్ 11 మండలాల్లో 1974 పనులకు 126 పనులు మొదలుపెట్టలేదు.

విశాఖపట్నం జిల్లాలో వివిధ దశల కింద రూ.118.96 మిగతా 2లో..

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

వార్త 8లో..

రెండు రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

వార్త 8లో..



అవార్డు, ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉక్కు అధికారులు

స్టీల్‌ప్లాంట్‌కు గ్రీన్‌టెక్ సేఫ్టీ అవార్డు

ప్రజాశక్తి - ఉక్కునగరం : సేఫ్టీ ఎక్సలెన్స్ కేటగిరీలో ప్రతిష్టాత్మక 'గ్రీన్‌టెక్ సేఫ్టీ అవార్డు 2023'ను వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కైవసం చేసుకుంది. 2022-23లో కార్యాలయ భద్రతను మెరుగుపరచడంలో అత్యుత్తమ సహకారం అందించినందుకు ఈ అవార్డును అందుకుంది. న్యూఢిల్లీలో జరిగిన 21వ వార్షిక గ్రీన్‌టెక్ అవార్డుల కార్యక్రమంలో అసోం మాజీ గవర్నర్ జగదీష్ ముఖి గ్రీన్‌టెక్ సేఫ్టీ అవార్డ్ 2023ను స్టీల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్), అదనపు ఛార్జ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎకె.బాగ్చికి అందజేశారు. ఎత్తైన నిర్మాణాలు, చిమ్నీలు మొదలైన వాటి తనిఖీకి డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించడం, సేఫ్టీ పరికరాల వినియోగాన్ని ట్రాక్ చేయడానికి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేయడం, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా (వెబినార్‌లు) భద్రతా శిక్షణలు అందించడం వంటి కార్యక్రమాలను నిర్వహించినందుకుగానూ గ్రీన్‌టెక్ ఫౌండేషన్ జ్యూరీ సభ్యులు విశాఖ ఉక్కును ప్రత్యేకంగా అభినందించారు.

నేడు సిపిఎం నాయకులు సత్తిబాబు సంతాప సభ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి



సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు డి.సత్తిబాబు సంతాప సభ బుధవారం ఉదయం 10 గంటలకు నర్సీపట్నంలోని తురకబడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరగనుంది. సంతాపసభకు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ హాజరుకానున్నారు.

మొదటి పేజీ తరువాయి..

జలజీవన్ మిషన్‌కు నిధుల కొరత

కోట్ల విలువైన 617 పనులు మంజూరయ్యాయి. రూ.8.45 కోట్లు ఖర్చు చేసి 126 పనులు పూర్తిచేయగా, 84 పనులు వివిధ స్థాయిల్లో వున్నాయి. ఇంకా 403 పనులు ప్రారంభించలేదు. అనకాపల్లి జిల్లాలో రూ.684.73 కోట్ల విలువైన 2048 పనులు మంజూరయ్యాయి. వీటిలో రూ.115.51 కోట్ల విలువైన 444 పనులు పూర్తిచేశారు. 594 పనులు వివిధ దశల్లో వున్నాయి. 1010 పనులు ప్రారంభించలేదు. పాడేరు డివిజన్‌లో రూ.131.78 కోట్ల విలువైన 3563 పనులు మంజూరయ్యాయి. రూ.43.34 కోట్లతో 1786 పనులు పూర్తిచేయగా, మరో 582 పనులు వివిధ దశల్లో వున్నాయి. 1195 పనులు మొదలుపెట్టలేదు. చేసిన పనులకు సకాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదలచేసి బిల్లులు చెల్లించకపోతే జలజీవన మిషన్ కింద ఇంటింటికీ కుళాయి నీరు ఇవ్వాలన్న ప్రకటిత లక్ష్యం ప్రయోజనాలు ప్రజలకు అందవు.

సామాజిక స్పృహ కీలకం

సమాజం పట్ల అవగాహన ఉంటే సర్వీస్ వచ్చాక గొప్పగా సేవ చేయగలుగుతామన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై సివిల్స్ కోసం ఒత్తిడి చేయడం సరికాదన్నారు. వారి ఇష్టాలను ప్రోత్సహించాలన్నారు. సివిల్స్ సాధనకు ఢిల్లీ, హైదరాబాద్ వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, సరైన మార్గానిర్దేశకం ఉంటే ఎక్కడి నుంచైనా సన్నద్ధం కావొచ్చని అన్నారు. సిటీ లా అండ్ ఆర్డర్ డిసిపి వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ సివిల్స్‌కు ఎంపిక కావాలంటే టాపర్స్ అవ్వాల్సిన పనిలేదన్నారు. సాధించాలనే సంకల్పం, కచ్చితమైన ప్రణాళికతో శ్రమిస్తే ఏమైనా సాధించవచ్చన్నారు. పరీక్షల పట్ల సరైన అవగాహన అవసరమన్నారు, సెమినార్లు యుపిఎస్‌సి అభ్యర్థుల్లో స్ఫూర్తి నింపడానికి, భయాన్ని పోగొట్టి ముందుకు నడిపంచడానికి దోహదం చేస్తాయన్నారు. సత్తా ఉండాలేగానీ అచ్చమైన ఇంగ్లీషు, పెద్ద పెద్ద డిగ్రీలతో పని లేదన్నారు. సివిల్స్ పరీక్షలకు సరదాగానో, ఇతర పరీక్షలకు ఉపయోగపడుతుందనో చదవరాదని, ఒకే లక్ష్యం పట్ల నిబద్ధతతో అంకితమై కృషి చేస్తే విజయం సాధిస్తామని తెలిపారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ యువతకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అన్ని పోటీ పరీక్షలకూ కోచింగ్ ఇస్తున్నామని తెలిపారు. విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, జానపద కళలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

సివిల్స్ విజేతలకు సత్కారం

అనంతరం 2023 సివిల్స్ పరీక్షల్లో విజేతలుగా నిలిచిన విశాఖపట్నానికి చెందిన 243వ ర్యాంకర్ కె.సాహిత్య, 469వ ర్యాంకర్ బొడ్డు హేమంత్‌లను సన్మానించారు. 353వ ర్యాంకర్ ఎన్.ఆశ్రిత ఆడియో సందేశం పంపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సాంస్కృతిక కార్యక్రమాల సమన్వయకర్త రాజేశ్వరరావు, అల్లూరి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.అభిమన్యు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వికలాంగుల పెన్షన్ పెంచాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యలపై మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. కుటుంబంతో సంబంధం లేకుండా ప్రతి వికలాంగునికీ అంత్యోదయ కార్డు ఇవ్వాలన్నారు. టిడ్కో గృహాల కేటాయింపులో వికలాంగులకు మొదటి అంతస్తు, రెండో అంతస్తు కాకుండా గ్రౌండ్ ఫ్లోర్ గృహాలను కేటాయించాలన్నారు. వికలాంగులకు, వృద్ధులకు తొలగించిన పెన్షన్లను పునరుద్ధరించాలన్నారు. సదరం సర్టిఫికెట్లు ఆధారంగా పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో వికలాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ఎత్తుల డేవిడ్ రాజు, జిల్లా అధ్యక్షులు పండూరి నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎపి నేవల్ ఆఫీసర్ ఇన్‌ఛార్జిగా రజనీస్ శర్మ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కమడోర్ రజనీస్ శర్మ ఆంధ్రప్రదేశ్ నేవల్ ఆఫీసర్ ఇన్‌ఛార్జిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. తూర్పు నౌకాదళంలో జరిగిన ఈ కార్యక్రమంలో కమడోర్ గోవర్ధన్ రాజు నుంచి ఈ బాధ్యతలను తీసుకున్నారు. రజనీస్ శర్మ నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డిసి) పూణేలో 1997లో చేరారు. నేవిగేషన్, డైరెక్షన్‌లో ఈయనకు ప్రత్యేక నైపుణ్యం ఉంది. డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ వెల్లింగ్టన్, నేవల్ వార్ కాలేజీ గోవాలో గ్రాడ్యుయేషన్ కూడా రజనీస్ శర్మ పూర్తిచేశారు. తూర్పు నౌకాదళంలో నేవిగేటింగ్ ఆఫీసర్‌గాను, ఐఎన్ఎస్ శివాలిక్, ఐఎన్ఎస్ అక్షయ్‌కు కమాండర్‌గానూ పనిచేసిన అనుభవం ఉంది.

శరవేగంగా కెకె లైన్ డబ్లింగ్ ప్రాజెక్టు పనులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లోని కొత్తవలస-కోరాపుట్-కిరండూల్ (కెకె) లైన్‌కు సంబంధించి కీలకమైన డబ్లింగ్ ప్రాజెక్టు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు 58 శాతానికిపైగా పూర్తయ్యాయి. అదేవిధంగా శృంగవరపుకోట, బొడ్డవర స్టేషన్ల మధ్య 7.3 కిలోమీటర్ల ప్యాచ్ పూర్తయింది. దీంతో గూడ్స్, ప్యాసింజర్ ట్రాఫిక్ సోమవారం నుంచి ప్రారంభమైంది.

విద్యార్థి దశలోనే చరిత్రను అధ్యయనం చేయాలి

పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విద్యార్థి దశలోనే భారతదేశ చరిత్రను అధ్యయనం చేయాలని, స్వతంత్ర సమరయోధులైన భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు కృషి చేయాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు అన్నారు. దువ్వాడ దగ్గర ఉన్న విజ్ఞాన్ కాలేజీలో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక తరగతులు మంగళవారానికి మూడో రోజుకు చేరుకున్నాయి. లక్ష్మణరావు భారతదేశ చరిత్ర పాఠాన్ని బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ చరిత్రను తిరగరాసి, బానిస సమాజంలోకి నెట్టేందుకు పూనుకుందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ బ్రిటీష్ వాడికి అనుకూలంగా వ్యవహరించి మతం పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేసి స్వాతంత్రోద్యమానికి తూట్లు పొడిచిందన్నారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు లాంటి అనేకమంది విప్లవకారులు దేశం కోసం తమ ప్రాణాలను, కుటుంబాలను త్యాగం చేశారని గుర్తు చేశారు. 2014 తర్వాత దేశ చరిత్ర, విద్యా వ్యవస్థలో బిజెపి అనేక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ఉన్నత విద్యకు పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలను దూరం చేసే విధంగా నూతన విద్యా విధానాన్ని తీసుకొచ్చి సర్వనాశనం చేస్తోందన్నారు. విద్యా సంస్థల్లో విద్యార్థి సంఘాలు లేకుండా చేయడం, విద్యార్థులకు ఎన్నికలు లేకుండా చేయడంతో ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని విస్తారంగా ఎక్కించి, రాజకీయాలకు విద్యార్థులను దూరంగా ఉంచుతున్నారన్నారు. నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవంలో లౌకిక రాజ్యానికి తూట్లు పొడిచే చర్యలు చేపట్టారన్నారు. ఈ నేపథ్యంలో గత చరిత్రను విద్యార్థులందరూ అధ్యయనం చేయాలని, శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించాలని, ప్రశ్నించేతత్వం పెరగాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర, అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న కుమార్, అశోక్, విశాఖ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు పాల్గొన్నారు.

క్యాబ్ డ్రైవర్ల రక్తదానం



రక్తదానం చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ క్యాబ్ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఓలా, ఉబర్ క్యాబ్ డ్రైవర్లు దాదాపు 120 మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రాజారత్నం హాజరై రక్తదాతలను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. డ్రైవర్ల ఐక్యత మున్ముందు ఇలాగే కొనసాగాలన్నారు. విశాఖ క్యాబ్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి.జగన్ మాట్లాడుతూ ఓలా, ఉబర్ యాప్‌లో లింకై 2500 మంది కార్మికులు జీవనం కొనసాగిస్తున్నారన్నారు. అయితే పెట్రోలు, కారు, ఇన్సూరెన్స్ అన్ని రకాల మెయింటినెన్స్‌లు డ్రైవరే పెట్టుకుంటున్నందున వచ్చిన ఆదాయంలో 30 శాతం వరకూ కమిషన్ తీసుకుంటున్నారన్నారు. ఆ రకంగా డ్రైవర్ల రక్తాన్ని ఓలా, ఉబర్ వాళ్ళు తీసుకుంటున్నారన్నారు. 'ఓలా, ఉబర్‌కు రక్తాన్ని ఇవ్వం, పేదవారికీ, రక్తం లేక ఇబ్బంది పడుతున్న వారికీ మా రక్తాన్ని ఇస్తాం' అన్న సందేశమిస్తూ ఈ రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మున్ముందు సిఐటియు ఆధ్వర్యాన ఐక్యపోరాటాలు సాగిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.శ్రీనివాసరావు, శ్రీరాములు, కార్యవర్గ సభ్యులు పోలి నాయుడు, శరత్, ఎస్.అబ్బాయి, కృష్ణ, నాయుడు, మురళి, గోపి, ఆనంద్, లక్ష్మీనారాయణ, శివకుమార్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులకు త్రీ టౌన్ ఎస్ఐ డిక్కల రాము పౌష్టికాహారం అందజేశారు. మంగళవారం నెహ్రూ నగార్ కాలనీ జిమ్ పార్క్‌లో పలువురు క్రీడాకారులను ఆయన పలకరించారు. వ్యాయామం ఆవశ్యకతను తెలియజేశారు. వైసిపి 28వ వార్డు ఇన్‌ఛార్జి పళ్లా దుర్గారావు, క్యాంపు స్పెషల్ ఆఫీసర్ వరప్రసాద్ అడ్మిన్ బి.ముఖేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ దాతృత్వం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రముఖ గృహోపకారణాల సంస్థ ఎల్‌జి ఎలక్ట్రానిక్స్ తమ 26వ వార్షికోత్సవం సందర్భంగా నగరంలోగల మదర్ అండ్ ఫాదర్ వృద్ధాశ్రమంలో నీటి శుద్ధి యంత్రాలను ప్రారంభించింది. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు బంగారుబాబు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల పట్ల సంస్థ దృక్పథాన్ని కొనియాడారు. ఎల్‌జి బ్రాంచ్ మేనేజర్ యుగంధర్ మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా నీటి నాణ్యత లోపిస్తోందన్నారు. ఇటువంటి యంత్రాల ద్వారా ఆశ్రమంలో ఉన్న పెద్దలందరికీ తాగునీరు అందుతుందని అన్నారు.

ఉద్యోగులను పట్టించుకోకపోవడం దుర్మార్గం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు 81 రోజుల నుంచి ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఎపి జెఎసి అమరావతి విశాఖ జిల్లా ఛైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జెఎసి ఆధ్వర్యాన భారీ సంఖ్యలో ఉద్యోగులు సామూహిక రిలే నిరహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి నెల 1న ఉద్యోగస్తులకు జీతాలు, పెన్షన్లు చెల్లించకపోవడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో తెలిపారు. దీక్షలో జెఎసి జిల్లా అధ్యక్షులు త్రినాథరావు, కార్యదర్శి రమేష్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగయ్య పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఎంజి మోటార్ గ్లోస్టర్ బ్లాక్ స్ట్రోమ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 99 ఏళ్ల వారసత్వం కలిగిన బ్రిటిష్ ఆటోమొబైల్ బ్రాండ్ ఎంజి మోటార్ ఇండియా భారతదేశపు మొట్టమొదటి అటానమస్ లెవల్ -1 ప్రీమియం ఎస్‌యువి ఎంజి గ్లోస్టర్ అడ్వాన్స్ బ్లాక్ స్ట్రోమ్ ఎడిషన్‌ను మంగళవారం విశాఖ మార్కెట్‌లో ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా ఎంజి మోటార్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా మాట్లాడుతూ ఈ ఎక్స్‌క్లూజివ్ స్పెషల్ ఎడిషన్ సొగసైన, లోతైన నలుపు రంగులో వస్తుందన్నారు. ఇది వాహనానికి స్పష్టమైన ప్రత్యేకతను జోడిస్తుందని తెలిపారు.

బిందు సేద్యంపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి. కాలనీ : జిల్లా ఉద్యానవన శాఖాధికారి కార్యాలయంలో ఎపిఎంఐపి ఇంజినీర్స్, ఎంఐ కంపెనీ ఇంజినీర్స్‌కు బిందు సేద్యంపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా ఎపిఎంఐపి ఒఎస్‌డి (టెక్నికల్) వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

వేసవి శిక్షణ శిబిరాలను సందర్శించిన మేయర్

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి ఆధ్వర్యాన ఆరిలోవ తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జివిఎంసి కల్యాణమండపం, సెయింట్ ఆన్స్ హైస్కూలు, డ్రైవర్స్ కాలనీలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి మంగళవారం సందర్శించారు. ఏయే క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు., ఎంతమంది పాల్గొంటున్నారు. వారికి అందించే డైట్ తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జివిఎంసి ఏటా విద్యార్థుల కోసం సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తోందని తెలిపారు. నగర పరిధిలో 333 సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్లు, పాలు, ఉడకబెట్టిన గుడ్లు, రాగి సంకటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.


విద్యార్థులకు గుడ్లు, పాలు, బిస్కెట్లు అందజేస్తున్న మేయర్ గొలగాని

నేరాలు ఘోరాలు

రామచంద్రాపురంలో చోరీ

- ఇంట్లోని బంగారం, వెండి, నగదు అపహరణ

ప్రజాశక్తి -గొలుగొండ : మండలంలో లింగంపేట పంచాయతీ శివారు రామచంద్రాపురంలో ఒకఇంట్లో బంగారం, వెండి వస్తువులతో పాటు నగదు చోరీకి గురైనట్లు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణదేవి పేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించిన తెలిపిన వివరాలిలావున్నాయి. మండలం లింగంపేట పంచాయతీ శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన ఎలిశెట్టి భాస్కరరావు కుటుంబ సమేతంగా శుక్రవారం తిరుపతి దర్శనానికి వెళ్లారు. తిరిగి సోమవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చే సరికి తలుపులకు వేసిన తాళం తెరిచి ఉండడం, లోపల ఉన్న బీరువా పగలగొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బీరువాలోని తులంన్నర బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి పట్టీలుతో పాటు సుమారు రూ.60వేలు నగదు చోరీకి గురై నట్లు బాధితులు తెలిపారు. దీనిపై బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి,నట్లు ఎస్ఐ ఉపేంద్ర తెలిపారు నర్సీపట్నం నుంచి క్లూస్ టీమ్ వచ్చి చోరీ ప్రదేశంలో ఆధారాలను సేకరించారు. వేసవిలో దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఉపేంద్ర సూచించారు.

మూడో విడత చందనం అరగదీత ప్రారంభం

ప్రజాశక్తి-సింహాచలం: రానున్న పౌర్ణమి రోజున స్వామివారికి మూడో విడత చందన సమర్పణ చేయనున్నారు. దీనికోసం ఆలయ అధికారులు మంగళవారం ఉదయం నుంచి చందనం అరగదీతను ప్రారంభించారు.

అప్పన్నను దర్శించిన ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-సింహాచలం: సింహాద్రి అప్పన్నను రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రరెడ్డి మంగళవారం దర్శించు కున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయం లోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. అధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందించారు.

సివైఎస్ఎస్ జిల్లా అధ్యక్షునిగా గణేష్

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం నుంచి చత్ర యువ సంఘర్ష్ సమితి (సివైఎస్ఎస్) జిల్లా అధ్యక్షునిగా కోట్ల గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎపి వ్యవహారాల ఇన్‌ఛార్జి నాయుడు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థుల సమస్యలపై దృష్టి కేంద్రీకరించనున్నట్లు గణేష్ తెలిపారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యార్థులపై ఒత్తిడి, తల్లిదండ్రులపై ఫీజుల భారం మోపుతున్నాయని విమర్శించారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థి సంఘం నాయకునిగా నియమితులైన గణేష్‌ను పార్టీ జోన్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ శీతల మదన్, జోనల్ కో-ఆర్డినేటర్ రమేష్, భాస్కర్ అభినందించారు.

అనంతవరంలో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని అనంతవరం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఇంకా పథకాలు అందని అర్హుల వివరాలను సేకరించారు. గ్రామంలో తాగునీటి సమస్య ఉందని కొంత మంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.రాంబాబు, సర్పంచ్ జి.లక్ష్మాజి, పెద్దఎర్రినాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు సుంకర గిరిబాబు, జి.చంద్రరావు, సత్యనారాయణ, ఎండిఒ ఎం.విజయకుమార్, తహశీల్దార్ తోట శ్రీవల్లీ పాల్గొన్నారు.

పాండ్రంగిలో జట్లమ్మ పండగ

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి గ్రామ దేవత జట్లమ్మతల్లి పండగను మంగళవారం గ్రామానికి చెందిన వలస కూలీలు వేడుకగా నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల నుంచి అమ్మ వారి సంబరాలతో గుడి వద్దకు చేరుకున్నారు. అమ్మవారి మొక్కులు చెల్లించుకున్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ


టీబీ రోగులకు ఫౌష్టికాహార సరుకులు అందిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-మధురవాడ : మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 23 మంది క్షయ రోగులకు అరబిందో ఫార్మా కంపెనీ సమకూర్చిన పౌష్టికాహారాన్ని మంగళవారం ఆసుపత్రి టీబీ యూనిట్ సిబ్బంది అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో 450 మంది క్షయ రోగులను అరబిందో కంపెనీ దత్తత తీసుకుందని తెలిపారు. వారికి ఒక్కొక్కరికి రూ.700 విలువైన సరుకులను అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సౌభాగ్య మణి, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ వి.వీరబ్రహ్మం, సిబ్బంది గోపి, అరుణ్‌కుమార్, అనూష, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

1న పాండ్రంగిలో జిల్లా స్థాయి రైతు భరోసా సభ

ప్రజాశక్తి -పద్మనాభం, భీమునిపట్నం : పద్మనాభం మండలం పాండ్రంగిలో జూన్ 1వ తేదీన జిల్లా స్థాయి రైతు భరోసా సభ నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, పద్మనాభం వ్యవసాయశాఖాధికారి ఎంబి.చలం మంగళవారం తెలిపారు. జిల్లాలోని 27,955 మంది రైతులకు రూ.20.97 కోట్లు పెట్టుబడి సాయం కింద బ్యాంక్ ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, గాజువాక, చినగదిలి, పెదగంట్యాడ మండలాల రైతులు హాజరుకావాలని కోరారు. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆ రోజు ఉదయం 10 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఈ సభను జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా వైసిపి ప్రభుత్వ నాలుగేళ్ల వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

వైసిపి ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు అయిన సందర్భంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేడుకలు నిర్వహించారు. పార్టీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు.

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త కెకె.రాజు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కటుమూరి సతీష్, కంపా హనుక్, అల్లు శంకరరావు, సారిపిల్లి గోవింద్, కె.అనీల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతిశ్రీనివాసరావు, పెద్దిశెట్టి ఉషశ్రీ, కంటి పాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 45వ వార్డు పరిధి ఎస్ఆర్ నగర్‌లో పేదలకు కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కంపా హనూక్ చీరలు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో 45వార్డు వైసిపి అధ్యక్షులు పైడి రమణ, మాజీ కార్పొరేటర్ కె.వెంగళరావు, హరిపట్నాయక్, ఆదిలక్ష్మి, నేపాల్ శ్రీను, నాయుడు, సన్నీ, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నం : జివిఎంసి 92వ వార్డు పరిధి కుమారి కల్యాణ మండపంలో జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యాన కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, గొర్ల అప్పలస్వామినాయుడు, తంబిరెడ్డి, కడిమి రామకృష్ణ, మార్కండేయులు, 91, 92 వార్డుల కార్యకర్తలు పాల్గొన్నారు

ఆరిలోవ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా సింహాద్రి అప్పన్న ప్రచార సమైఖ్య వ్యవస్థాపకులు నారాయణస్వామి ఆధ్వర్యంలో దీనదయాల్‌పురంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను మేయర్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ పి.రమణ, అరుకు ఎఎంసి డైరెక్టర్ కె.రామదాసు, వైసిపి నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో..

12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యాన వార్డు పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సత్తి మందారెడ్డి, కన్నేటి సుబ్బారెడ్డి, అర్జున్, సూర్యారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


వైసిపి విశాఖ జిల్లా కార్యాలయంలో వేడుకలు...



అనకాపల్లి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎంపిపి సూరిబాబు

ఆనందపురం : ఆనందపురం కూడలిలో వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి సంబరాలు జరుపుకున్నారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బంక సత్యనారాయణ, బంక సత్యం, జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు, మజ్జ వెంకటరావు, పాండ్రంకి శ్రీను, బోట్ట రామకృష్ణ, కోరాడ ముసలి నాయుడు, లోడగల రమణ పాల్గొన్నారు.

తగరపువలస : తగరపువలస వై జంక్షన్ వద్ద వైసిపి నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జగుపిళ్ల ప్రసాద్, కొప్పల రమేష్, ఉప్పాడ నాగేశ్వరరావు, వెంపాడ వెంకటరమణ, అక్కరమాని చినబాబు, కొప్పల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి : వైసిపి ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లయిన సందర్భంగా స్థానిక రింగ్ రోడ్‌లోని వైసీపీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మల్ల బుల్లిబాబు, మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందని, అలాగే సంక్షేమ పథకాల అమల్లో దేశంలోనే అగ్రభాగాన నిలిచిందని చెప్పారు. కార్యక్రమంలో కసింకోట జెడ్పిటిసి సభ్యుడు దంతులూరి శ్రీధర్ రాజు. వైసిపి సీనియర్ నాయకులు కొణతాల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : వైసిపి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో నగర మేయర్ హరి వెంకట కుమారి, శాసన మండలి సభ్యురాలు వరుదు కల్యాణి, రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్ల చైర్మన్లు కోలా గురువులు, జాన్‌వెస్లీ, తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్ తమ్మినేని వ్యాఖ్యలపై టిడిపి ఆగ్రహం

ప్రజాశక్తి-ఉక్కునగరం : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బ్లాక్ క్యాట్ కమాండోల రక్షణ లేకపోతే ఫినిష్ అయ్యేవారని స్పీకర్ తమ్మినేని సీతారాం చేసిన వ్యాఖ్యలపై టిడిపి నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. అగనంపూడిలో మంగళవారం ఏర్పాటుచేసిన టిడిపి ముఖ్య నాయకుల సమావేశంలో విశాఖ జిల్లా టిడిపి అధికార ప్రతినిధి నెల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. గౌరవప్రదమైన స్పీకర్ స్థానంలో ఉన్న తమ్మినేని సీతారాం ఇలా మాట్లాడి ఆ పదవికే కళంకం తెచ్చారని, తక్షణమే స్పీకర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్‌రెడ్డి, ఆ పార్టీ నాయకులు చంద్రబాబును చంపడానికి కుట్ర పన్నుతున్నారని స్పీకర్ మాటలను చూస్తే అనుమానం కలుగుతోందన్నారు. రోజుకో పార్టీ మారే ఊసరవెల్లిలాంటి తమ్మినేని నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు.

టిఎన్‌టియుసి జిల్లా అధికార ప్రతినిధి బలిరెడ్డి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి దానబాల పైడికొండ మాట్లాడుతూ, మహానాడులో చంద్రబాబు మినీ మ్యానిఫెస్టో ప్రకటించాక అన్ని వర్గాల ప్రజల్లో హర్షం వ్యక్తమైందన్నారు. మహానాడుకు ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు కల్పించినా విజయం సాధించిందని తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నెల్లి శ్రీనివాసరావు తదితరులు

వికలాంగుల ఉపాధికి శిక్షణ

ప్రజాశక్తి -గాజువాక : వికలాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శిక్షణ ఇస్తున్నట్లు ట్రైన్ ఆర్గనైజేషన్ సౌత్ ఇండియా మేనేజర్ సురేష్ తెలిపారు. గొడ్డివానిపాలెం ఎంపిపి స్కూలు ప్రాంగణంలో కల్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన వికలాంగులు, యువతీ యువకులకు శిక్షణ, ఉపాధి కల్పనపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ, వికలాంగులకు, యువతకు రిటైల్ సెక్టర్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. జూన్ మొదటి వారం నుంచి పెదగంట్యాడ, సింహాచలం, నర్సీపట్నం ప్రాంతాలలో ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. 45 రోజులు పాటు శిక్షణ ఇచ్చి అనంతరం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. జులైలో రెసిడెన్షియల్ ట్రైనింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రోగ్రామ్‌కు అయ్యే ఖర్చును ట్రైన్ ఆర్గనైజేషన్ భరిస్తుందని తెలిపారు.

హజారే గ్రూప్ చైర్మన్ ప్రవీణ్, రైస్ ఆర్గనైజేషన్ ప్రతినిధి అమరేంద్ర, సెక్రెటరీ నరేష్ మాట్లాడుతూ, జూన్ చివరి వారంలో మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. సభాధ్యక్షులు కల్చర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కల్చర్ ఫౌండేషన్ కోశాధికారి ఎస్.గిరిచరణ్‌నాయుడు, సభ్యులు వై.శివప్రసాద్, మధు పాల్గొన్నారు.

కనకమాంబ పండగకు ఆహ్వానం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతంపేటలోని కనకమాంబ అమ్మవారి పండుగకు ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డిని 25వ వార్డులోని శ్రీ కృష్ణ యువజన సేవా సంఘం కమిటీ సభ్యులు ఆహ్వానించారు.



కబ్జా స్థలం వద్ద ధర్నా చేస్తున్న నల్లూరి సూర్యనారాయణ

వైసిపి భూ కబ్జాపై టిడిపి ధర్నా

ప్రజాశక్తి -గాజువాక : దువ్వాడ బ్రిడ్జి పక్కన ప్రభుత్వ స్థలాన్ని వైసిపి నేతలు కబ్జా చేస్తున్నారని టిడిపి ఆధ్వర్యాన మంగళవారం సాయంత్రం ధర్నా చేశారు. ఈ సందర్భంగా 86వ వార్డు టిడిపి అధ్యక్షులు నల్లూరి సూర్యనారాయణ మాట్లాడుతూ, భూకబ్జాలకు కేరాఫ్ వైసిపి నేతలని ఆరోపించారు. వైసిపి నేతలు ఆగడాలకు హద్దు లేకుండా పోయిందన్నారు. ఖాళీ స్థలం దొరికితే కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు.



ఎయు వీసీని కలిసిన జపాన్ తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీ

జపనీస్ లాంగ్వేజ్ కోర్స్ బలోపేతానికి కృషి
- ఎయు వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం ద్వారా అందిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్స్ బలోపేతానికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య ఎం.జగన్నాథరావుతో కలిసి జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పిఎం.బాలాజీ మంగళవారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థుల ద్వారా ఆంధ్ర యూనివర్సిటీలో స్టార్టప్, ఇన్నోవేషన్ కల్చర్ వేగంగా అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో జపనీస్ లాంగ్వేజ్‌లో శిక్షణ అవసరమని వీసీ అభిప్రాయపడ్డారు. పిఎం.బాలాజీకి జపాన్ ప్రతినిధులతో సత్సంబంధాలు ఉన్న నేపథ్యంలో ఏయూలో జపాన్ లాంగ్వేజ్ శిక్షణకు ఒక సర్టిఫికెట్ కోర్సు అందుబాటులోకి తెచ్చేలా సహకారం అందించాలని వీసీ ప్రసాద్‌రెడ్డి కోరారు. దీనికి సమ్మతి తెలియజేసిన బాలాజీ అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు.

ముగిసిన విండ్‌బాల్ క్రికెట్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న కె.నర్సింగరావు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నడుపూరు రామాలయం మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి విండ్‌బాల్ క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో సాహితీ కంప్యూటర్ అధినేత కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ, మూడు రోజులుగా హోరాహోరీగా సాగిన పోటీల్లో మొదటి స్థానంలో సోల్జర్స్ టీమ్, రెండవ స్థానంలో సీతానగర్ టీమ్, మూడో స్థానంలో అగనంపూడి టీమ్ నిలిచాయని తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, ట్రోఫీ, రెండవ బహుమతిగా రూ.7 వేలు, ట్రోఫీ, మూడో బహుమతిగా రూ.5 వేలు, ట్రోఫీలను అందజేసి అభినందించారు. మాజీ సైనికుడు అప్పలరాజు ఆధ్వర్యాన 34 టీములు జిల్లా వ్యాప్తంగా పాల్గొన్నాయి. ఇటీవల రైలు ప్రమాదంలో మరణించిన ప్రదీప్ కుమార్ పేరుమీద పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎవిఆర్.రాజు, సర్పంచ్ అప్పలరాజు, జాగారపు శ్రీను, బాలు, ఆర్మీ గోవింద్, త్రినాథ్ పాల్గొన్నారు.

పార్కుల్లో జిమ్‌లు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 72వ వార్డు పరిధి ప్రగతి పార్కు, అమరావతి పార్కుల్లో జివిఎంసి నిధులతో ఏర్పాటు చేసిన జిమ్‌లను మంగళవారం గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, పార్కుల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పి.సింహాచలం, 72వ వార్డు కార్పొరేటర్ ఎజె.స్టాలిన్, వార్డు వైసిపి నాయకులు సిరట్ల వాసు, వార్డు పెద్దలు గుడివాడ అమ్మన్న, బీవి దుర్గాప్రసాద్, శివన్నారాయణ, విశ్వనాథం, సిపిఐ నాయకులు అప్పారి విష్ణుమూర్తి, జి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



జిమ్ ప్రారంభిస్తున్న నాగిరెడ్డి

ఎస్‌టిబిఎల్‌లో...
తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ప్రతిష్ట ఉత్సవం



ఎస్‌టిబిఎల్‌లో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రజాశక్తి - ఉక్కునగరం

శీలానగర్ ఎస్‌టిబిఎల్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం తిరుమల బాలాజీ దివ్యక్షేత్ర ప్రతిష్టా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్వామి, అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణంలో అర్చకులు గణపతి హోమం, విశ్వక్సేన ఆరాధన పూజలు నిర్వహించారు. విగ్రహాలను శుద్ధి చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంగళవారం విశిష్ట హోమాలు జరిగాయి. బుధవారం విగ్రహ ప్రతిష్ఠ, భారీ అన్న సమారాధన ఉంటాయని ట్రస్ట్ బోర్డు సభ్యులు తెలిపారు.

పాండ్రంగిలో మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ సర్వే నెంబర్ 384-1లో వంట పొలాలకు నీరు పారే కాలువలో ఉన్న మట్టిని అక్రమంగా కొంత మంది తవ్వి రవాణా చేస్తున్నారని ఆ గ్రామానికి చెందిన ఒకటవ వార్డు సభ్యుడు మహంతి అప్పలరమణ 1902కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. దీనిపై నీటి పారుదల శాఖాధికార్లు స్పందించారు. కేసు నమోదుచేశారు.

భూగోళాన్ని కాపాడుకుందాం

ప్రజాశక్తి-సీతమ్మధార : జీవరాశికి కళకళలాడేది భూగోళం మాత్రమేనని, దీనిని కాపాడుకుందాం అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం పిలుపునిచ్చారు. సీతమ్మధారలో విద్యార్థులతో మంగళవారం నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో ఆయన మాట్లాడారు. ముందుగా విద్యార్థుల చేత నర్సరీ మొక్కలను పేపర్ కవర్లలో ఏర్పాటుచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ తమ తల్లిదండ్రులకు పర్యావరణ పరిరక్షణ గురించి, ట్రాఫిక్ ప్రమాదాల గురించి అవగాహన కల్పించాలని కోరారు. మిషన్ లైఫ్‌లో భాగంగా ప్రతి ఒక్కరూ పర్యావరణహితంగా జీవించాలని కోరారు. గ్రీన్ వాలంటీర్ కిరణ్మయి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ గ్రీన్ వాలంటీర్‌గా మారి ప్రకృతి వనరుల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. ఉపాధ్యాయులు నీరజ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు తమ విద్యార్థులు కృషి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు సోనీ మాట్లాడుతూ నిరంతరం విద్యార్థుల చేత కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వాళ్ళ పర్యావరణహితంగా జీవించేలా తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడారు.

విజిలెన్స్ కమిటీ జాతీయ కార్యదర్శిగా సుధాకర్

ప్రజాశక్తి -భీమునిపట్నం, పద్మనాభం : అంతర్జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా మండలి విజిలెన్స్ కమిటీ జాతీయ కార్యదర్శిగా భీమిలి మండలం తాటితూరు గ్రామానికి చెందిన భాగం సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు హ్యూమన్ రైట్స్ లీగల్ సర్వీస్ కౌన్సిల్ వర్కింగ్ చైర్మన్ వి.సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ వ్యవస్థాపక చైర్మన్ అనూషా రాథోడ్ సుధాకర్‌కు ఈ మేరకు నియామక పత్రం అందజేసినట్లు సుబ్బారావు పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల న్యాయ సేవా మండలి విజిలెన్స్ కమిటీ జాతీయ కార్యదర్శిగా నియమించిన కౌన్సిల్ ప్రతినిధులకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

పనుల్లో వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి

ప్రజాశక్తి- కె.కోటపాడు

గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. మంగళవారం కొరువాడ, పోతనవలస, అగ్రహారం గ్రామాల్లో చేపడుతున్న పలు భవనాలు, జగనన్న ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ముందుగా కొరువాడలో జగనన్న లేఔట్ వద్దకు వెళ్లి ఇళ్ళ లబ్ధిదారులతో మాట్లాడారు. ఇప్పటికే గృహప్రవేశాలు చేసుకున్న వారిని, ప్రభుత్వం అందించే పూర్తిస్థాయి సాయం అందిందా లేదా అని ప్రశ్నించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఎంత ఖర్చయిందని అడిగారు. లేఔట్‌లో పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరగాలని హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో నాడు నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. పూర్తిచేసిన సచివాలయ భవనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అద్దె భవనంలో ఉన్న హెల్త్ వెల్నెస్ సెంటర్ వద్దకు వెళ్లి ప్రతిరోజు ఓపి ఎంత నమోదు అవుతుందని ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. హైస్కూల్‌కి వెళ్లి నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని, మరుగుదొడ్లను పరిశీలించారు. కలెక్టర్ వెంట తహాశీల్దారు రమేష్‌బాబు, ఎంపీడీవో శచీదేవి, మండల ఇంజనీర్ బాలాజీ అప్పారావు, ఇతర అధికారులు ఉన్నారు.



కొరువాడలో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్


మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షులు మాణిక్యం

మహాలక్ష్మి హత్యపై సమగ్ర విచారణ చేయాలి : ఐద్వా

ప్రజాశక్తి-అచ్యుతాపురం

స్థానిక ఎస్‌కెఆర్ లాడ్జిలో సోమవారం జరిగిన మహాలక్ష్మి హత్యపై సమగ్ర విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన ఐద్వా సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహాలక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నిరంతరం నిఘా లేకపోవడం, లాడ్జిలో దిగిన వారిపై ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం లాడ్జి యాజమాన్యం నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నారు. లాడ్జిలపై పోలీసులు నిఘా పెట్టాలన్నారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు రూపొందించినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు, అధికారులు విఫలమవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆర్ లక్ష్మి, విజయ, దివ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రబాబు రాక

ప్రజాశక్తి-అచ్యుతాపురం

టిడిపి ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు కుమారుడు రాజు ప్రియాంక నూతన దంపతులను ఆశీర్వదించడానికి టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు బుధవారం అచ్యుతాపురం రానున్నారు. అచ్యుతాపురం లేపాక్షి ఎంపోరియంకు సాయంత్రం నాలుగు గంటలకు ఆయన విచ్చేస్తున్నట్లు నాగేశ్వరరావు తెలిపారు. మే 11న జరిగిన తన కుమారుడు రాజు ప్రియాంకల వివాహానికి రావాలని గతంలో చంద్రబాబును ఆహ్వానించారు. అయితే వివాహ తేదీన చంద్రబాబు హాజరు కాలేకపోయారు. దీంతో ప్రగడ నాగేశ్వరరావు తన సొంత గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన నూతన దంపతుల పరిచయ కార్యక్రమానికి చంద్రబాబుకు ఆహ్వానించగా, ఆయన బుధవారం వస్తున్నారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా నాయకులు, ఎలమంచిలి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని నాగేశ్వరరావు కోరారు.

మోదకొండమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


ప్రజాశక్తి అచ్చుతాపురం

ఎస్ఈజెడ్ కాలనీ కొత్త కోడూరు గ్రామంలో మోదకొండమ్మ అమ్మవారి పండగ సందర్భంగా ఆలయంలో మంగళవారం ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ చైర్మన్ యు సుకుమార్ వర్మ, ఎస్ఐ సన్యాసినాయుడు, వైసిపి నాయకులు గాడి గణేష్, అడిగర్ల దేవుడు తదితరులు పాల్గొన్నారు.


నేల ఆరోగ్యంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -మునగపాక రూరల్

మండలంలోని పల్లపుఆనందపురం గ్రామంలో మంగళవారం బిసిటి ఆధ్వర్యాన కృషి విజ్ఞాన కేంద్ర భూసార పరీక్ష శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు నేల ఆరోగ్యంపై రైతులకు అవగాహన కల్పించారు. నేలలో ఎటువంటి పోషకాలు ఉన్నాయో తెలుసుకోవడానికి మట్టి పరీక్షలు చేయుంచుకోవాలని సూచించారు. మట్టి పరీక్షలకు మట్టిని ఏ విధంగా సేకరించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో బిసిటి సామాజిక కార్యకర్త పి.ఎ.నాయుడు, నూకాంబికా రైతు క్లబ్ కన్వీనర్ కో కన్వీనరు కె.మోహనరావు, కె.వీరసొంతోష్, ఎ.రమణబాబు, 30మంది రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీహరిరావు


విరాళం అందజేస్తున్న ముత్యాల సతీష్

ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి-అనకాపల్లి

అచ్చుతాపురం మండలం ఎం.జగన్నాధపురం గ్రామంలో భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి ముత్యాల గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు తనయుడు సతీష్ మంగళవారం రూ.2 లక్షలు విరాళాన్ని అందజేశారు. స్థానిక నరసింగరావుపేట ఎంవిఆర్ స్వగృహంలో ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ బ్రహ్మాజీకి ఈ మేరకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో దేవాలయాల అభివృద్ధికి దేవాదాయ శాఖ కంటే ముందు వినిపించే పేరు ఎంవిఆర్ అని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి, అన్ని తీర్థయాత్రలకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. కుటుంబంలో పెద్ద కొడుకు స్థానంలో నిలబడి వారికి దర్శనాలు చేయిస్తూ ముత్యాల వెంకటేశ్వరరావు నిలిచారని తెలిపారు. అదే క్రమంలో చుట్టుప్రక్కల గ్రామాలలో ఎటు చూసినా దేవాలయాల అభివృద్ధిలో ఎంవిఆర్ కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. స్వార్థపూరిత రాజకీయాలకు తమ తండ్రి వెంకటేశ్వరరావు వ్యతిరేకమన్నారు. నిస్వార్థంతో సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

పౌర హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని రావాడ పంచాయతీ పరిధి ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఎంపీడీవో హేమ సుందర్, తహాశీల్దార్ ప్రకాష్‌రావు, డివిఎంసి మెంబర్ రేబాక మధుబాబు మాట్లాడారు. అంటరానితనం నేరమన్నారు. ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన హక్కులను తెలియజేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ వసతి గృహాల ప్రవేశాలు, నిర్వహణ, వాటి విధులు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కులాంతర వివాహాల్లో భాగంగా ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు వేరే ఇతర కులస్తులను వివాహం చేసుకుంటే ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీఐ పి.ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ ఎం.సన్యాసి నాయుడు, వైస్ ఎంపీపీ బంధం నాగేష్, ఎంఈఓ సునీత, మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు కె రామారావు, పంచాయతీ విస్తరణాధికారిణి పద్మజ, వసతి గృహ సంక్షేమ అధికారి సుజాత, వీఆర్వో, వాలంటీర్లు, పౌర హక్కుల సంఘం ప్రతినిధులు, ఎస్సీ కాలనీ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ హేమసుందర్

గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు వెలికితీత

ప్రజాశక్తి- కశింకోట

కశింకోట మండలం వెదురుపర్తి వద్ద శారదానదిలో సోమవారం గల్లంతైన ఇద్దరి విద్యార్థుల మృతదేహాలను విశాఖ ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం మంగళవారం వెలికితీశారు. కశింకోట పోలీసుల కథనం ప్రకారం.... ఎస్.రాయవరం మండలం పోతురెడ్డిపాలెం గ్రామానికి చెందిన పిల్లి అనిల్ (14), నక్కపల్లి మండలం చందనాడకు చెందిన ఏడిద ప్రసాద్ (17) వేసవి సెలవులకు కశింకోట మండలం వెదురుపర్తి గ్రామంలోని తమ తాత పలివెల అప్పన్న ఇంటికి వచ్చారు. సోమవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో అనిల్ తల్లి లక్ష్మి బట్టలు ఉతికేందుకు త్యేగాడ, వెదురుపర్తి మధ్యలో ఉన్న శారదా నదికి వెళ్లింది. ఆమె వెంట కుమారుడు అనిల్, ప్రసాద్ కూడా వెళ్లారు. లక్ష్మి బట్టలు ఉతుకుతుండగా సుమారు 10 గంటల సమయంలో అనిల్, ప్రసాద్ శారద నదిలో లోతు తక్కువగా ప్రదేశంలో స్నానం చేస్తూ లోతుగా ఉన్న ప్రదేశంలోకి వెళ్లి మునిగి పోయారు. సోమవారం గాలించినా వారి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం విశాఖ ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం శారదానదిలో గాలించి అనిల్, ప్రసాద్ మృతదేహాలను వెలికి తీశారు. మృతదేహాలకు అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పటించినట్లు ఎస్ఐ ఆదినారాయణ రెడ్డి తెలిపారు.


మృతదేహాలను ఒడ్డుకు తెస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది

పంచాయతీ కార్మికుల సమస్యలపై వినతి


డిపిఒకు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు గనిశెట్టి తదితరులు

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణికి ఎపి గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అనకాపల్లి జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, కార్మికులకు యూనిఫారం సబ్బులు, జోళ్ళు, ఐడి కార్డులు ఇవ్వాలని కోరారు. సకాలంలో వేతనాలు రాక గత ఆరు నెలలుగా కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అర్ధాకులతో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఆరు నెలల బకాయి వేతనాలు ఉన్నాయని వెంటనే చెల్లించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. అనకాపల్లి మండలం సిహెచ్ఎన్ అగ్రహారం కార్మికుడు కోటేశ్వరరావు బీజింగ్ పౌడర్ జల్లుతుండగా కాలుకు గాయమై కాలు వేలు తీసివేసిన పరిస్థితి ఏర్పడిందని, ఈ కార్మికుడు గత 20 సంవత్సరాలుగా ఈ పంచాయతీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఆయన కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను అన్ని మండల అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని డిపిఓ శిరీష రాణి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములకలపల్లి అప్పలరాజు, పలివెల చిన్నారావు, లోకేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ పంటలపై అవగాహన

ప్రజాశక్తి- సబ్బవరం

ఖరీఫ్ సీజన్ పంటలపై అన్నదాతలకు గ్రామ వ్యవసాయ సహాయకులు అవగాహన కల్పించాలని అనకాపల్లి సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం. రామారావు కోరారు. మండలంలోని అమృతపురం ఆర్‌బికెను మంగళవారం ఆయన సందర్శించి గ్రామ వ్యవసాయ సహాయకులు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు, పచ్చిరొట్ట ఎరువులు, వివిధ సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. పిఎం కిసాన్ పొందుతున్న రైతులు సకాలంలో ఈకెవైసి పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మండల వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, ఎఈఒ బాలరాజు, వ్యవసాయ సిబ్బంది, పాల్గొన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- 15 మందిపై దాడి

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడలో సోమ, మంగళవారాల్లో పలువురు వ్యక్తులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. సోమవారం రాత్రి ఆరు బయట నిద్రిస్తున్న చౌడువాడకు చెందిన నూకాలమ్మ, పి.అచ్చియమ్మ, పి.ఇంద్ర, షేక్ మేరా, బి.గురయ్య, రాము, కె.సూరిఅప్పారావు, కోరుబిల్లి శ్రీనివాస్‌లను తీవ్రంగా గాయపరిచింది. సీమనాపల్లికి చెందిన తంగ్రికొడుకులు బొడ్డేటి వెంకటరావు, సూర్యారావుపై దాడి చేసింది. మంగళవారం గొట్లాం, పాత వలసలకు చెందిన పలువురుపై కూడా పిచ్చికుక్క దాడి చేయడంతో వీరంతా కె కోటపాడు 50 పడగల ఆసుపత్రికి క్యూ కట్టారు. అందరికీ వైద్యం అందించామని, రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి తెలిపారు.

శ్మశాన వాటికలో బోరుబావి ఏర్పాటు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారమ్మపాలెం ఎస్‌సి కాలనీ శ్మశానవాటికలో బోరుబావి ఏర్పాటు పనులను స్థానిక సర్పంచ్ దాడి లావణ్య కన్నం నాయుడు మంగళవారం ప్రారంభించారు. ఎస్‌సిల శ్మశాన వాటికలో సుమారు లక్ష రూపాయల వ్యయంతో బోరు బావి ఏర్పాటు చేసి, వారి అవసరాలకు కావలసిన నీరు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు బత్తిని దేవుడమ్మ, దొడ్డి అర్జున రావు, పాల సొసైటీ అధ్యక్షులు దొడ్డి వెంకటరావు, దాడి గోవిందు, దొడ్డి అప్పారావు, దువ్వాడ అప్పారావు, బత్తిని కోటేశ్వరరావు, వంకర కోటి, వంకర దేముడు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల పరిషత్ అధ్యక్షులు గొర్లి సూరిబాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ ధర్మారావు అధ్యక్షతన గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల మీద సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్మాణం చేసి నిరుపయోగంగా ఉన్న అంగన్వాడీ కేంద్రాల భవనాలను ఉపయోగంలోకి తేవాలని కోరారు. వాటికి ఏమైనా పనులు చేయించవలసి వస్తే మండల పరిషత్ నుండి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. జగనన్న కాలనీలకు సంబంధించి సర్పంచులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకున్నవాళ్ళకి ఎల్పీసీలు త్వరగా అందించాలన్నారు. సర్పంచులు, ఎంపిటిసీలు గ్రామాల అభివృద్ధిలో భాగమవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ బి.వి.సత్యవతి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు పెతకంశెట్టి జోసెఫ్, వైస్ ఎంపిపిలు అయిత ఆనందరాము, విల్లూరి సూర్య కుమారి చంద్రశేఖర్, పంచాయతీరాజ్ డిఈ వేణుగోపాల్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ వైఫల్యంతో కుంటుపడిన అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ వైఫల్యం వల్లే అనకాపల్లి అభివృద్ధి కుంటిపడిందని మాజీ శాసనసభ్యులు, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం లక్ష్మీదేవి పేట ఆర్‌ఓబి ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయకుంటే రాజీనామా చేయాలని పీలా సెల్ఫీ ఛాలెంజ్ విసిరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కి కమీషన్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి టిడిపి రూ.53 కోట్లు మంజూరు చేసినది గుర్తు చేశారు. మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు చిత్తశుద్ధి ఉంటే సెల్ఫీ ఛాలెంజ్‌ను స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, యాంద్రా రామకృష్ణ, సిమిది రామకృష్ణ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పిట్ల హరీష్, భాను చంద్ర, అఖిల్ పాల్గొన్నారు.

మరమ్మతుకు గురైన ధర్మశ్రీ ఎస్కార్ట్ వాహనం

ప్రజాశక్తి బుచ్చయ్యపేట

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ భద్రతా వాహనం కొండెంపూడిలో మరమ్మతులకు గురై నిలిచిపోయింది. గ్రామంలో ఓ కార్యక్రమానికి ధర్మశ్రీ హాజరయ్యారు. ఎస్కార్ట్‌గా పోలీసు సిబ్బంది వాహనం ధర్మశ్రీ వాహనంతో అనుసరించింది. మంగళవారం మధ్యాహ్నం తిరుగు ప్రయాణం అయ్యేటప్పుడు ఎస్కార్ట్ వాహనం ముందు భాగంలో యాక్సిల్ విరిగిపోవడంతో ఆగిపోయింది. దీంతో భద్రతా సిబ్బంది ఈ వాహనాన్ని అక్కడే నిలిపివేసి మరో వాహనంలో ఎమ్మెల్యే వెంట వెళ్లారు. రన్నింగ్‌లో విరిగిపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని, ఆగి ఉన్నప్పుడే విరిగిపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

విద్యార్థుల విజ్ఞానమే లక్ష్యంగా వేసవి శిబిరాలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్

విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించే లక్ష్యంగా శాఖాగ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రభాకరరావు పిల్లలతో వ్యాయామం చేయించారు. 'కష్టేఫలి' కథను విద్యార్థులకు వివరించారు. వివిఎస్ నర్సింగ్ హోం ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ వైఎల్‌విఎస్ఎన్ రాజు పాల్గొని, ఎముకలు దృఢపడడానికి, వాటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పౌష్టికాహారం గురించి వివరించారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ అలేఖ్య దివ్య పాల్గొని దంతాలకు వచ్చే వివిధ వ్యాధులు, దంత సమస్యలు, దంతాల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలపై అవగాహన కల్పించారు. పిల్లలకు టూత్ బ్రష్, పేస్ట్, టంగ్ క్లీనర్, స్నాక్స్ అందించారు.. రాజలక్ష్మి యోగ టీచర్ పాల్గొని, పిల్లలకు ప్రాణాయామం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వివరించారు. అనంతరం పిల్లలకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కనకరాజు మాస్టర్, విశ్రాంత గ్రంథాలయాధికారి జి..మురళీకృష్ణ తదితరులతో పాటు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వేసవి విజ్ఞానశిబిరంలో పాల్గొని, విద్యార్థులకు విలువైన సూచనలను చేసిన అతిథులను గ్రంథాలయాధికారి పి.దమయంతి అభినందనలు తెలిపారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గొలుగొండ : విద్యార్థులంతా దేశభక్తిని పెంపొందించుకునే పుస్తకాలను పఠనం చేయాలని రిసోర్స్ పర్సన్ వి.రాజబాబు సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎన్. రాజబాబు ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రామకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్థానిక శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయాధికారి వాసాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళవారం పుస్తకసమీక్షలపై అవగాహన కల్పించారు. తెలుగు ఉపాధ్యాయుడు ఎన్.వి.ఎస్.ఆచార్యులు పాల్గొని పుస్తకపఠనం ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు.. విద్యార్థులకు కథల పుస్తకాలను అందించి, వాటిపై పుస్తక సమీక్షలు రాయించి గ్రంథాలయంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌లు యోగా గురువు శ్రీనివాసరాజు, వై.అచ్యుతరావు, ఎస్.సీతారామయ్య, తేజోమూర్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పుస్తక సమీక్షలు రాసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కశింకోట : పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించికోవచ్చని విశ్రాంత ఉద్యోగి నంబా రమణ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో మంగళవారం చదువు అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలు పాటల్లో కూడా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి ఎన్.వరలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు

మునగాడ : వివిధ పోటీలలో పాల్గొనడం ద్వారా ప్రతిభకు పదును పెట్టవచ్చని కార్మిక నాయకులు బి.సత్యానందం అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో మంగళవారం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. సీనియర్లకు స్వచ్ఛభారత్ అంశంపై, జూనియర్లకు దేశభక్తి అంశంపై చిత్రలేఖణ పోటీలు నిర్వహించారు. 50 మంది పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందం మాట్లాడుతూ, పోటీల వల్ల నవ కల్పనలు సాధ్యపడతాయని, పనిలో నాణ్యత పెరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, రచయిత కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సింహాచలం : ఆదివారం గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా లూడో పరమపద సోపానం వంటి అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి నరసింహ మాట్లాడుతూ, గ్రంథ పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బిబి.రాజేంద్రప్రసాద్, మజ్జి అజయ్‌భాను, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్లపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి-చోడవరం

న్యాయం, ఆత్మగౌరవం కోసం ఢిల్లీలో పోరాడుతున్న మహిళా రెజ్లర్లపై అక్రమ అరెస్టులకు పూనుకున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ, రెజ్లర్ల పోరాటానికి సంఘీభావంగా ఓపిడిఆర్ ఆధ్వర్యంలో మంగళవారం చోడవరం బస్ కాంప్లెక్స్ నుండి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపిడిఆర్ నాయకులు కె.గౌరీ శంకర్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన మహిళా రెజ్లర్లు తమ ఆవేదనను చెప్పడానికి నూతన పార్లమెంట్ భవనం దగ్గరికి వెళ్తుండగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసు బలగాలు వారిపై విరుచుకుపడి అక్రమంగా అరెస్టులు చేసి, నడి రోడ్డుమీద ఈడ్చుకు వెళ్లడం దారుణమన్నారు. స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కన్వీనర్ ఓవివిఎస్ లక్ష్మి కుమారి మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీలో ఐదు నెలలుగా రెజ్లర్లు న్యాయ పోరాటం చేస్తుంటే ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌ఓ నాయకులు ఎన్.భాస్కర్, ఎస్.రుద్రి, రామలక్ష్మి, ఏ.మౌనిక, మోహన్, శ్రీను పాల్గొన్నారు.

మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టులు సరికాదు

అనకాపల్లి : లైంగిక వేధింపులకు నిరసనగా పోరాడుతున్న మహిళా రెజ్లర్ల అక్రమ అరెస్టులను జన సాహితీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐటిఆర్ని శివాజీరావు, ఎస్.నూకాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు కొమ్ముకాస్తూ, అతని చేతిలో లైంగిక వేధింపులకు, భౌతిక దాడులకు గురై న్యాయం కోసం పోరాడుతున్న రెజ్లర్లను అరెస్టు చేయడమంటే బాధితులనే నేరస్తులను చేస్తున్నట్లు ఉందని పేర్కొన్నారు. పాలకుల నిర్లక్ష్య వైఖరిని ప్రజాతంత్ర మేధావులు, రచయితలు, కవులు కళాకారులు ఖండించాలని వారు కోరారు.



ర్యాలీ అనంతరం నిరసన తెలుపుతున్న ఓపిడిఆర్ ప్రతినిధులు

చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి- అనకాపల్లి

రాజమహేంద్రవరంలో జరిగిన టిడిపి మహానాడులో పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన మినీ మేనిఫెస్టోపై హర్షం వ్యక్తం చేస్తూ జిల్లా తెలుగు మహిళ ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. టిడిపి అనకాపల్లి పార్లమెంటు కార్యాలయంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడారు. 18 నుండి 59 సంవత్సరాల ఆడవాళ్లకు నెలకు రూ.1500, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ప్రకటించారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నాయకులు రమణమ్మ, కోట నీలవేణి, రేబాక మాలతి, కొణతాల రత్నకుమారి, కాయల ప్రసన్న లక్ష్మి, భీశెట్టి హేమ, శంకర్ల పద్మలత, వేదుల సూర్యప్రభ పాల్గొన్నారు.



సబ్బవరంలో చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

సబ్బవరం : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం తెలుగు మహిళ పెందుర్తి నియోజకవర్గ అధ్యక్షురాలు మడక పార్వతి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రొంగలి శ్రీరాములమ్మ, పెందుర్తి మాజీ ఎంపిపి రెడ్డి వరలక్ష్మి, నాయకులు ఎన్.సైదమ్మ, మడక సంతోషి, గండ్రెడ్డి మాలతి, గొర్లి సూర్య కుమారి, బి నాగమణి, అనిత, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : టిడిపి మినీ మేనిఫెస్టో పట్ల హర్షం వ్యక్తం చేస్తూ తెలుగు మహిళ నాయకురాలు ఆడారి జానకి ఆధ్వర్యాన మండలంలోని పాటిపల్లి, మంగళవారపేట గ్రామాల్లో మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

నక్కపల్లి : చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోలో బిసిలకు ప్రత్యేక చట్టం తెచ్చి, ఆర్థికంగా సామాజికంగా, రాజకీయంగా అన్ని విధాలా ఆదుకుంటానని హామీ ఇవ్వడంపై బిసి నేతలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం నక్కపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బిసి నేతలు కూరందాసు నూకరాజు, కూరందాసు సింహాచలం, వైయిబోయిన రమణ, మనబాల కొండబాబు, కోరిమి సూర్య గణేష్, పల్లా రాంబాబు ,నాగరాజు గింజాల శ్రీను, కె. శ్రీను. మునుకోటి అప్పన్న, కుంచె మధు, గరికిన సింహాద్రి, గోసల శ్రీకాంత్, కాళ్ళ సత్తిబాబు, చొప్పా పాప పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన



మాట్లాడుతున్న ఎంఆర్‌ఐ నాగరాజు

ప్రజాశక్తి- గొలుగొండ: రాజ్యాంగం ప్రజలకు కల్పించిన హక్కులు, బాధ్యతలపై అవగాహన అవసరమని గొలుగొండ రెవెన్యూ పరిశీలకులు నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలో కొత్త మల్లంపేట గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజ్యాంగంలో పేర్కొన్న హక్కుల గురించి అవగాహన ఉండాలన్నారు. హక్కులతో పాటుగా బాధ్యతలు గుర్తెరిగి మసలు కోవాలని సూచించారు. కార్యక్రమంలో గొలుగొండ హెడ్ కానిస్టేబుల్ కొండబాబు, సర్పంచ్ పోలిరెడ్డి రాజబాబు, ఎస్‌సి హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

మొక్కుబడి సభలతో ప్రయోజనమేంటి?

కొత్తమల్లంపేటలో అధికారులు లేకుండానే మొక్కుబడిగా పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారని అంబేద్కర్ ఇండియా మిషన్ మండల అధ్యక్షుడు ఎస్. చిరంజీవి ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మండలంలోని ఏదో ఒక పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, ఎంపిడిఒ, తహశీల్దార్, ఎస్ఐ, ఇతర ముఖ్య అధికారులు పాల్గొని, ప్రజలకు సమీకరించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం నిర్దేశించగా తూతూమంత్రపు తంతులా దీన్ని నిర్వహిస్తే లాభం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరోపణలు మాని.. అభివృద్ధి చేసి చూపించు

ఎమ్మెల్యే గణేష్‌కు టిడిపి యువనేత విజయ్ సవాల్


ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : అయ్యన్నపై అవాకులు చవాకులు పేలడం మానేసి, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌కు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్ సవాల్ విసిరారు. మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గాన్ని అయ్యన్నపాత్రుడు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. అల్లూరి సీతారామరాజు కాలేజీ, 150 పడకల ఏరియా ఆసుపత్రి, ఎన్‌టిఆర్ మినీస్టేడియం, పాలిటెక్నికల్ కాలేజ్ ఇలా విద్య,వైద్యం ఇతరత్రా విషయాల్లోనూ ఎంతో అభివృద్ధి చేశారని, ఐదేళ్లలో రూ. 2548 కోట్లు ఖర్చు చేశారన్నారు. 1985లోనే నర్సీపట్నంలో కంప్యూటర్ కోర్సును అయ్యన్నపాత్ర తీసుకువచ్చారని, ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ కూడా ఏర్పాటు చేశారన్నారు. టార్చ్‌లైట్ వెలుగులో డెలివరీ కేసులు చేసిన ఘనత వైసిపిదేనన్నారు. అల్లర్లు సృష్టించేందుకు గవర వీధిలో పిహెచ్‌సి ఏర్పాటు చేశారే తప్ప, దాని వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. ఆర్లి అటవీ ప్రాంతంలో రోడ్ల విస్తరణ జిఒను టిడిపి హయాంలోనే తెస్తే, ఇపుడు ఎన్నికల్లో లబ్ధికి, ప్రజలను మభ్య పెట్టేందుకు డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిపై చర్చకు ఎక్కడికైనా వస్తామని సవాల్ చేశారు.దాచుకోవడం, దోచుకోవడం తప్ప, ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లి ఈ ప్రాంతానికి ఏం కావాలో అడిగేసత్తా, ధైర్యం ఉందాయని ఎమ్మెల్యే గణేష్‌ను ప్రశ్నించారు.



మీడియాతో మాట్లాడుతున్న విజయ్

మున్సిపాలిటీలోగానీ, ఆసుపత్రిలోగానీ అభివృద్ధిపై ఏనాడైనా సమీక్ష జరిపారా? అని ప్రశ్నించారు. టిడ్కో ఇళ్లను పంపిణీ చేయలేదని, జర్నలిస్టుల కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించలేదన్నారు. రంగురాళ్లు, గంజాయి అక్రమ రవాణాలో అనుచరగణమంతా మునిగి తేలుతుంటే, ఎమ్మెల్యేగా ఏం చేస్తున్నావని ప్రశ్నించారు. రాజకీయభిక్ష పెట్టిన చంద్రబాబు, అయ్యన్నపాత్రుడిని వాడువీడు అంటూ ఉచ్చనీచాలు మరిచి సంబోధించడం, టిడిపిపై విమర్శలు చేయడం నీచమైన నైజానికి అద్దం పడుతోందన్నారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోతో దిమ్మదిరిగి, మతిలేని మాట్లాడడం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. వచ్చే ఎన్నికల్లో అఖండ ప్రజాదరణతో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దానిమిరెడ్డి మధు, సైలా గోవిందు, మురళిపాల్గొన్నారు

శిథిలావస్థలో ఉన్న
విద్యుత్ స్తంభాలను తొలగించాలి



ట్రాన్స్‌కో ఎఇకి వినతిపత్రం ఇస్తున్న ఎంపిటిసి మధు, తదితరులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు ఎస్‌సి, బిసి కాలనీల్లో శిథిలావస్థలో ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని ఎంపిటిసి కుంచె మధు కోరారు. మంగళవారం .ఉపమాక విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌కో ఎఇ కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయన్నారు. దీనివలన ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని ,అధికారులు స్పందించి త్వరతగతిన శిథిలమైన స్తంభాలు తొలగించాలని కోరారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పల్లా రాంబాబు,కమిడి వెంకటరమణ(శ్రీను)పల్లా నాగరాజు,దారబాల నరసింహ మూర్తి(బుజ్జి)యాదగిరి నూకరాజు,పిట్టా నాగేశ్వరరావు, కమిడి బాబూరావు,వేంపాడు గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ అయినం పూడి అప్పలరాజు, కమ్మిళ శివరామకృష్ణన్

పేదల సమస్యలపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నాలుగేళ్ల పాలనలో పేదల సమస్యలపై వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి సూర్యచంద్ర అన్నారు. జనం కోసం జనసేనలో భాగంగా నాతవరం మండలం శంగవరంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండుమూడిళ్లన్న అనర్హులకే జగనన్న ఇళ్ల ఇచ్చారేగానీ, అర్హులకు ఇవ్వలేదని పలువురు మహిళలు విన్నవించారు. పశువుల ఆసుపత్రి ఉన్నా డాక్టర్ ఉండరని, నెలకొసారి చుట్టపుచూపుగా వస్తుంటారని విన్నవించారు. మందులు కొరత కూడా ఉందన్నారు. దీనిపై సూర్యచంద్ర స్పందిస్తూ, ఇళ్లు, పశువైద్యాధికారి సమస్యలను జిల్లా కలెక్టర్‌కు విన్నవించి తగు చర్యలకు డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో బైన మురళి, వేగిశెట్టి శ్రీనివాస్, మాగిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సాంస్కృతిక ప్రదర్శనలో ఒక సన్నివేశం

ప్రజాశక్తి- మాడుగుల : వచ్చేనెల 6వ తేదీన జరగనున్న మాడుగుల మోదకొండమ్మ పండగ సందర్భంగా పది రోజుల ముందు నుండే సాంస్కృతిక కార్యక్రమాల సందడి మొదలైంది. ఆదివారం శతకంపట్టు వద్ద విశాఖ సాయినాథ కళాసమితి ఆధ్వర్యంలో భరతనాట్యం, సోమవారం విశాఖ, హైదరాబాద్ బృందాలతో డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం మద్దుకూరి ఆర్ట్ క్రియేషన్స్ మృత్యుపత్రం, మణికంఠ ఆర్ట్స్, పిఠాపురం వారి కొత్తతరం కొడుకు నాటికలను ప్రదర్శించారు.

మోదమ్మ పండుగలో సాంస్కృతిక సంబరాలు

వచ్చేనెల 6న జరగనున్న మోదకొండమ్మ పండగ సందర్భంగా ఈ ఏడాది భారీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నుంచే ప్రారంభమైన సంబరాల్లో భాగంగా బుధవారం అమలాపురం రసవాహిని వారి శ్రీకారం, మాడుగుల గన్నం రాజు సుబ్బారావు కళానిలయం వారి సవారీ, గురువారం జాస్మిన్ ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ వాయిదాల పెళ్లి, విశాఖ కళాభినయ వారి శ్రీకాశివాసి రావయ్యా అను నాటికలను ప్రదర్శించనున్నారు. జూన్ 2వ తేదీ శుక్రవారం నుండి 7వ తేదీ వరకు విజయ భారతి నాట్యమండలి హైదరాబాద్, సురభి ఉపేంద్ర బృందం వారిచే శ్రీకృష్ణ లీలలు, బాలనాగమ్మ, సతీ సావిత్రి, పాతాళ భైరవి, భక్త ప్రహ్లద, మాయాబజార్ వంటి పౌరాణిక నాటకాల ప్రదర్శనలు జరగనున్నాయి.

6న, పండగ రోజు దుర్గాలమ్మ గుడి వద్ద డీ డాన్సర్స్ ముంబై కళాకారులు, డీ పండు మాస్టర్, తేజస్విని రాజు బృందం వారిచే డాన్స్ 2023, దసరా స్టేజి వద్ద ఎం.ఎం.దాస్ వారి వీరాభిమన్యు బుర్రకథ, బిక్కవోలు రాంబాబు, అవతార్ నాయుడు బృందం గయోపాఖ్యానం యుద్ధ సన్నివేశం, ఎం వీర్రాజు, గన్నబాబు బృందం వారి సత్యహరిశ్చంద్ర నాటకం, దాసరి వీధి వద్ద విశాఖ, హైదరాబాద్ కళాకారుల డాన్స్ హంగామా, జవ్వాది గెడ్డ జంక్షన్ వద్ద మార్టేరు ప్రేమకుమార్ ఆర్ట్స్ వారి సినీ నృత్యప్రదర్శన, గవర వీధి వద్ద డ్యాన్స్ మస్తీ, జగ్గన్న చావిడి వద్ద విశాఖపట్నం వారి డ్యాన్స్,డ్యాన్స్, రావి చెట్టు జంక్షన్ వద్ద డ్యాన్స్ ఉత్సవ్, శ్రీనివాస థియేటర్ వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్, జవ్వాది గెడ్డ వద్ద తోలుబొమ్మలాట ప్రదర్శన నిర్వహించనున్నారు. దీంతో పాటు పండగ రోజు ఊరేగింపులో ఎపితోపాటు తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాల కళాకారులతో పలు నేల వేషాలు, బండ్ల వేషాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది

పిడుగుపాటుకు గేదె మృతి



మృతి చెందిన గేదె వద్ద రోదిస్తున్న పాడిరైతు కుటుంబసభ్యులు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలో పాత కృష్ణాదేవిపేటలో మంగళవారం మధ్యాహ్న సమయంలో పిడుగు పడి వెనుకోటి సత్యనారాయణకు చెందిన పాడి గేదె మృతి చెందింది. వ్యవసాయ భూముల్లో మేత మేస్తున్న సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తున్న సమయంలో పిడుగుపాటుకు గురై గేదె చనిపోయిందని బాధిత కుటుంబీకులు తెలిపారు. చనిపోయిన గేదె విలువ రూ.80వేలు ఉంటుందన్నారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న పాడిగేదె మృతితో బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరుతున్నారు.

పారదర్శకంగా సమగ్ర భూ రీసర్వే



మాట్లాడుతున్న కిల్లాడ శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కోటవురట్ల: జగనన్న భూ హక్కు పథకంలో భాగంగా నిర్వహిస్తున్న సర్వేను పారదర్శకంగా చేపట్టాలని వైసిపి మండల అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు కోరారు. మంగళవారం పాములవాక గ్రామంలో భూసర్వేపై రైతులతో రెవెన్యూ అధికారులు సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా రీసర్వే డిటి నానిబాబు, గ్రామ రెవెన్యూ అధికారి రామచంద్రమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సర్వే పట్ల రైతులు అపోహలు వీడి అధికారులకు సహకరించాలని కోరారు. గ్రామ సర్వేయర్ శాంతి మాట్లాడుతూ, రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహిస్తామని, ఆందోళన అవసరం లేదన్నారు. రైతులుఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు,

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -మాడుగుల : మండలంలోని కెజె పురం గ్రామంలో టిడిపికి చెందిన సుమారు 70 మంది కార్యకర్తలు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు సమక్షంలో మంగళవారం వైసిపిలోకి చేరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వీరికి కండువాలు వేసి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ సమిష్టిగా వుంటే గ్రామాభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మెచ్చి, ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు తమ పార్టీలోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



పార్టీలో చేరిన వారితో ఉపముఖ్యమంత్రి బూడి

అప్రకటిత విద్యుత్ కోతతో అవస్థలు

ప్రజాశక్తి- కోటవురట్ల : మండల వ్యాప్తంగా గడిచిన నాలుగు రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో అన్ని వర్గాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అసలే వేసవికాలం కావడంతో ప్రజలు ఉక్కపోత కారణంగా అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు కరెంట్ లేక ఇబ్బందులకు గురయ్యారు.వ్యాపారులు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు. మరోవైపు విద్యుత్ సరఫరాసరిగా జరగకపోవడంతో వ్యవసాయబోర్ల వద్ద వేసిన కూరగాయలు, ఇతర పంటలకు సాగునీరు అందక కొనవాడిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తాగునీటికి అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి అప్రకటిత కోతలను ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు రద్దు, సిపిఎస్ రద్దు ,ఇతర సమస్యలను పరిష్కారం కోరుతూ ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఒక రోజు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. సంఘం నక్కపల్లి తాలూకా అధ్యక్షులు ఎస్.వెంకట్రావ్, సెక్రటరీ యువిఎస్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వర్‌లో సాంకేతిక సమస్యతో
రెండు రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు



రిజిస్ట్రేషన్లు జరగక ఖాళీగా ఉన్న కార్యాలయం

ప్రజాశక్తి -కోటవురట్ల : సాంకేతిక కారణాలతో వరుసగారెండోరోజైన మంగళవారం కూడా మండల కేంద్రంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సర్వర్‌లో తలెత్తిన లోపంతో రాష్ట్ర వ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో అన్నిచోట్లా రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయినట్లు సిబ్బంది తెలిపారు, అయితే నెలాఖరు కావడంతోపాటు, జూన్ నెల నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో చోటుచేసుకోనున్న మార్పులకు అనుగుణంగా మార్కెట్ ధరలకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ల చార్జీలు పెరగనుండడంతో పలువురు రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వస్తున్నారు, అయితే గడిచిన రెండు రోజులుగా ఒక్క డాక్యుమెంటు కూడా రిజిస్ట్రేషన్ కాకపోవడం విశేషం, అయితే సిబ్బంది డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తున్నా, దాన్ని ఆమోదించినట్లు డౌన్‌లోడ్ కాకపోవడంతో క్రయవిక్రయదారులు ఆందోళన చెందుతున్నారు. కోటవురట్ల రిజిస్ట్రేషన్ కార్యాలయానికి స్థానిక మండల వాసులతోపాటు నాతవరం, మాకవరపాలెం మండలాల దూర ప్రాంతాల నుంచి క్రయవిక్రయదారులు వస్తుంటారు. రెండు రోజులుగా వారంతా కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలుచేసి చేసి వెనుదిరిగిపోతున్నారు.

కల్యాణ మండపం ప్రారంభం

ప్రజాశక్తి-మాడుగుల : మండల కేంద్రంలో బాల్యం వద్ద రూ.6 లక్షలతో నిర్మించిన కల్యాణ మండపాన్ని మంగళవారం ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. కొందరు దాతలు సహాయం చేయడంతో ఆలయ కమిటీ అధ్వర్యంలో దీన్ని నిర్మించారు. కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాథు శ్రీనివాసరావు, పైడినాయుడు, నానాజీ, అప్పీ తదితరులు పాల్గొన్నారు

ఆధార్ అప్‌డేట్‌కు
విద్యుత్ అంతరాయం



ఆధార్ కేంద్రంలో వేచియున్న ప్రజలు

ప్రజాశక్తి -కోటవురట్ల : ఆధార్ అప్‌డేట్ కోసం చినబొడ్డేపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక శిబిరం విద్యుత్ అంతరాయంలో పనిచేయలేదన్లి స్థానిక సర్పంచ్ శివరాం, సచివాలయ సిబ్బంది తెలిపారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్ కార్డు అప్‌డేట్ క్యాంపెయిన్‌లో భాగంగా ఊరూరా రోజుకొకచోట ఆధార్ నమోదు కేంద్రాలను ఏర్పాటు చేస్తుండగా, మంగళవారం చినబొడ్డేపల్లి గ్రామంలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారనే సమాచారం పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో సచివాలయానికి చేరుకున్నారు. అయితే విద్యుత్ అంతరాయంలో అప్‌డేట్ చేసుకోకుండానే వారంతా నిరాశగా వెనుదిరిగారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరాం మాట్లాడుతూ చిన్నబొడ్డేపల్లికి కేటాయించిన రోజున ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ సాగనందున, తమ పంచాయతీలో మరోరోజు క్యాంపు పెట్టాలని కోరారు. దీనిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని విశాఖ జిల్లాలో పలుచోట్ల మంగళవారం ఘనంగా నిర్వహించారు. అరుణపతాకాన్ని ఆవిష్కరించారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం తోపాటు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ, ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక నేతలు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం



సిఐటియు పతాకానికి సెల్యూట్ చేస్తున్న నేతలు



అనకాపల్లిలో సిఐటియు పతాకాన్ని ఆవిష్కరిస్తున్న శంకరరావు

కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో సిఐటియు 54వ ఆవిర్భావ సభ మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జగదాంబ కార్యాలయం వద్ద రాష్ట్ర కమిటీ సభ్యులు పి.వెంకటరెడ్డి పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. పాలకవర్గాలు అనుసరిస్తున్న దోపిడీ విధానానికి వ్యతిరేకంగా కార్మిక వర్గాన్ని నిరంతరం చైతన్యపరుస్తూ కార్మిక రాజ్యాన్ని ఏర్పాటు చేయాలన్నది సంఘం లక్ష్యమన్నారు. దేశంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చిందని, అవి అమలైతే కార్మికులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. అనంతరం జగదాంబ సిఐటియు కార్యాలయం నుంచి బొమ్మన బ్రదర్స్, సిఎంఆర్, జడ్జి కోర్టు, జివిఎంసి, ఆర్‌టిసి కాంప్లెక్స్, డాబా గార్డెన్స్ మీదుగా అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. సిఐటియు నేతలు కెఎం.కుమార్ మంగళం, బి.జగన్, ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావు, పి.వెంకట రావు, చంద్రమౌళి, ప్రకాష్ రావు, నూకరాజు పాల్గొన్నారు.

అనకాపల్లి : సిఐటియు 52వ ఆవిర్భావ దినోత్సవం అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సిఐటియు పతాకాన్ని సంఘం జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా నాయకులు కె.లోకనాథం మాట్లాడుతూ ఐక్య పోరాటాల వేదికగా ఏర్పడిన సిఐటియు భారతదేశంలో కార్మిక వర్గ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తుందని చెప్పారు. నేడు కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతుందని విమర్శించారు. కార్మిక వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని మండిపడ్డారు. దేశానికి పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వర్గ రాజ్య లక్ష్యంతో ఏర్పాటైన సిఐటియుని అందరూ ఐక్యంగా ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కౌలు రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.బాలకృష్ణ, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రాజు, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా కోశాధికారి సూర్యకళ మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పి.చిన్నారావు, రాజు, రమణమ్మ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురం సెంటర్లో సిఐటియు జెండాను జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1970లో ఏర్పడిన సిఐటియు నాటి నుండి నేటి వరకు ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కె.సోము నాయుడు, చండీ, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

పరవాడ : సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పరవాడ ఫార్మసిటీలో మంగళవారం సిఐటియు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సవరించి యజమానులు కార్మికుల శ్రమ దోపిడీ చేసుకునేందుకు వీలుగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందన్నారు. సిఐటియు నాయకులు కర్రి పోతున్నాడు, కర్రి ఎంకునాయుడు, పి చిన్నారావు, డి దేముడు, కె.ధర బాబు, ఏ రాజా పాల్గొన్నారు.

కశింకోట : మండల కేంద్రంలో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులందరికీ ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని పోరాడుతుందని చెప్పారు. మహిళ ప్రజా సంఘాలు సభ్యులు టి తనుజా, డిడి వరలక్ష్మి, భవానీ, విశ్రాంత ఉద్యోగులు పి సత్యనారాయణ, గోపాలరావు పాల్గొన్నారు.


ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన 60వ వార్డు జివిఎంసి వార్డు కార్యాలయం వద్ద తోపుడు బళ్లు, ముఠా, జివిఎంసి కార్మికుల ఆధ్వర్యాన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. జివిఎంసి కార్యాలయం వద్ద సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు జెండాను ఏగురవేశారు. 59వ వార్డు పరిధి వాయుపుత్రకాలనీలో డి.రాజేష్, నెహ్రూనగర్ లేబర్ జంక్షన్‌లో చీమల పైడినాయుడు, 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో వై.లక్ష్మణరావు, చింతల్లోవలో రాజు, విడిఆర్ గొడౌన్స్‌లో దేముడు, హెచ్‌పిసిఎల్ కల్యాణి గేట్ వద్ద గణేష్, తోపుడు బళ్ల నాయుకులు త్రిమూర్తులు, ముఠా నాయుకులు బి.రమణ సిఐటియు జెండాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో కె.రమణ, బి.సూరిబాబు, బి.రాంబాబు, గంగులు, లోకేష్, ఎం.రమణబాబు, రాజు, దేవి, త్రిమూర్తులు, కృష్ణ, డి.గోపాల్, జె.రామునాయుడు, ఆనంద్, లోకేష్, రామకృష్ణ, పూడి పైడిరాజు, వై.గంగాధర్, బి.శ్రీను, మోహన్, ఈశ్వరరావు, శంకరరావు, మహేంద్ర, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

గాజువాక : భెల్ అడ్మిన్ గేట్ వద్ద పతాకాన్ని కె.పవన్‌కుమార్ ఎగురవేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో భెల్ సిఐటియు నాయకులు జిటిపి ప్రకాష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి వి.బాబూరావు, సిఐటియు నాయకులు, ఎస్.జగన్నాథరావు, ఎఐటియుసి నాయకులు పరమేష్‌రావు, ఎస్సీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేవుడు, సహకార సంఘాల నాయకులు కె.రామనాయుడు, బి.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పిఎం.పాలెం : జివిఎంసి 7వ వార్డు పరిధి రిక్షాకాలనీ వద్ద సిఐటియు జెండాను మున్సిపల్ యూనియన్ నాయకులు జి.కిరణ్ ఆవిష్కరించారు. సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు, నాయకులు సిహెచ్.శేషుబాబు, పి.రమేష్, ఎస్.రామప్పడు, బి.శ్రీను, పి.చంటి, జి.కిరణ్, ఎం.శేఖర్, సుశీలమ్మ, కె.అరుణమ్మ పాల్గొన్నారు.

ఉక్కునగరం : స్టీల్ సిఐటియు ఆధ్వర్యాన సెక్టర్-11 కాంప్లెక్స్ వద్ద యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నగర సిఐటియు ఉపాధ్యక్షులు ఎన్.రామారావు మాట్లాడుతూ, కార్మికుల ఐక్య ఉద్యమాన్ని బలపరుద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు పి శ్రీనివాసరాజు, పుల్లా రావు, యు వెంకటేశ్వర్లు, మరిడయ్య, కెపి సుబ్రహ్మణ్యం, వివి.రమణ, బిఎన్.మధుసూదన్, సత్యనారాయణ, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు కార్మికులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : స్థానిక కృష్ణాబజారు సెంటరులో ముఠా కార్మిక సంఘం అద్వర్యంలో సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అరుణపతాకాన్ని సంఘం అధ్యక్షుడు రుత్తల గోవింద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ సిఐటియు ఆవిర్భావం నుంచి దేశంలో ప్రభుత్వ, ప్రయివేటురంగాల్లో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు, స్కీమ్ వర్కర్లను కూడగట్టి సంఘాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్మిక హక్కుల రక్షణకు, ఉద్యోగ భద్రత, వేతనాలు, ఇతర సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణకు పోరాటాలు నిర్వహిస్తూ, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ఉద్యమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆవిర్భావం నుంచి నేటివరకు ఒకేవిధంగా కార్మికుల కోసం ఉద్యమిస్తున్న సిఐటియు, భవిష్యత్‌లోనూ ఇదే పంథాను కొనసాగిస్తుందన్నారు.సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.నానాజీ, అప్పారావు, రాము, రాజు, అర్జున్ పాల్గొన్నారు.



సిఐటియు ఆవిర్భావ వేడుకలో మాట్లాడుతున్న రామారావు



నర్సీపట్నంలో సిఐటియు ఆవిర్భావ వేడుకలో ముఠా కార్మికులు

కార్మికుల ఐక్యతే ప్రధాన లక్ష్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ

ఎంవిపి.కాలనీ : కార్మికులను ఐక్యపరచడమే సిఐటియు ప్రధాన లక్ష్యమని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ అన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమార మంగళం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో శర్మ ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. సిఐటియు పోరాట చరిత్రను తెలియజేశారు. సంఘం ఏర్పడ్డాక కార్మికోద్యమం కొత్తపుంతలు తొక్కిందన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమంలో సిఐటియు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. పాలికేళ్ల క్రితమే స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు ప్రయత్నాలు జరగ్గా సిఐటియు నాడు ఏ విధంగా అడ్డుకుందో తెలియజేశారు. ప్లాంట్‌లో ఐక్యపోరాటాలు ఎలా నడిపిందో వివరించారు. కార్మిక శక్తి దేశ భవిష్యత్తును మార్చనుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటీ నాయకులు పి.వెంకటరెడ్డి, మణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
తెలుగు దినపత్రిక
సిపిఎం నాయకులు, కార్మికనేత
కామ్రేడ్ డి.సత్తిబాబు
సంస్మరణ ప్రత్యేక అనుబంధం
Advt. Feature
జననం : 10-04-1960 మరణం: 20-5-2023
అనకాపల్లి జిల్లా | బుధవారం 31-05-2023 | 8 పేజీలు





కార్యదీక్షాపరుడు సత్తిబాబు



- యుక్త వయసులో ఉద్యమంలోకి..
- 40 దశాబ్దాలకు పైగా ప్రజా, కార్మిక పోరాటాల్లో మమేకం

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, సిఐటియు నర్సీపట్నం డివిజన్ అధ్యక్షులు దుంపలపూడి సత్యనారాయణ (డి.సత్తిబాబు) నర్సీపట్నం ప్రాంతంలో కార్మికులు, కష్టజీవులకు ఆప్తుడు. నిరంతరం జనం బాగుకోసం పరితపించే వ్యక్తి. పార్టీ అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించే నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు. జీవితాంతం ఎర్ర జెండా బాటలో నడిచిన కామ్రేడ్. నాలుగు దశాబ్దాలకుపైగా ప్రజా ఉద్యమాల్లో మమేకమైన ప్రజల మనిషి.

డి.సత్తిబాబు 1960 ఏప్రిల్ 10న గొలుగొండ మండలం, నాగాపురంలో జన్మించారు. లచ్చారావు, బుల్లెమ్మ దంపతుల ఐదుగురు కుమారుల్లో సత్తిబాబు రెండోవారు. సిపిఐ నాయకులు మేకా సూరిబాబు, ఉపాధ్యాయుడైన తన తండ్రి లచ్చారావు ప్రోత్సాహంతో సత్తిబాబు తన 16వ ఏటా యువజన సంఘం కార్యకర్తగా ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. గొలుగొండ మండలంలోని గిరిజన, ప్రజా సమస్యలపై జరిగిన ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనేవారు. యువజన సంఘం జిల్లా కార్యదర్శిగా పని చేశారు. నాడు ఆరంభమైన ఆయన ఉద్యమ ప్రస్థానం తుదిశ్వాస విడిచేవరకు కొనసాగింది.

మేకా సూరిబాబు రెండో కుమార్తె శారదను ఆయన వివాహం చేసుకున్నారు. సూరిబాబు మరణానంతరం సిపిఎంలో చేరిన సత్తిబాబు 1992 నుంచి 30 ఏళ్లగా నర్సీపట్నం కేంద్రంగా ప్రజా, కార్మిక ఉద్యమాల్లో ఉన్నారు.

నిబద్ధత, కార్యదక్షత కల్గిన సిపిఎం కార్యకర్తగా నర్సీపట్నం ప్రాంతంలో ముఠా, బిల్డింగ్, ఆటో, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, కాఫీ వంటి రంగాల కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారు. మున్సిపల్ వర్కర్స్, కాఫీ పిక్కల కార్మిక సంఘం, షాపు ఎంప్లాయీస్, పసుపు కార్మికులు, ముఠా వర్కర్స్ తదితర సంఘాల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు. కామ్రేడ్ తలారి సత్యనారాయణ ఉన్నప్పుడు ఇద్దరూ కలిసి కార్మిక సమస్యలపై పోరాటాలు నడిపారు. కార్మిక ఉద్యమాన్ని విస్తరించారు. ఆయన చనిపోయిన తరువాత కార్మికోద్యమం బాధ్యతను సత్తిబాబు తన భుజస్కందాలపై వేసుకొని, బాధ్యతగా నడిపారు. అసంఘటితరంగ కార్మిక సంఘాల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు.

విశాఖ నగరం, అనకాపల్లికి పరిమితమైన సిపిఎం ఉద్యమం నర్సీపట్నం, విశాఖ ఏజెన్సీకి (మిగతా 8లో..)







సత్తిబాబు జ్ఞాపకాల దృశ్యమాలిక



ఉపాధి హామీ కూలీల సమస్యలపై మాట్లాడుతూ..



మాజీ ఎంపీలు జితేంద్ర చౌదరి, మిడియం బాబూరావులతో కలిసి..



సత్తిబాబు పార్థివదేహం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నేతలు



పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ సాగిన పోరాటంలో..




రోలుగుంట మండలంలో భూ పోరాటంలో పాల్గొన్న సత్తిబాబు



మురా కార్మికుల సమస్యలపై ఉద్యమించిన క్రమంలో మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడుతో..



మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలంటూ ఇటీవల జరిగిన సంఘీభావ కార్యక్రమంలో..



సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో నివాళ్లర్పిస్తూ..



వందలాది మందితో నర్సీపట్నంలో సాగుతున్న సత్తిబాబు అంతిమయాత్ర

సత్తిబాబు గారు నేల మీద నడిచిన మనిషి. అందుచేత కనిపించిన ప్రతి మనిషినీ పలకరించేవాడు. తెలిసివాళ్లను కలిసి వాళ్ల బాగోగులు తెలుసుకునేవాడు. అవసరానికి ఒక మాటను భరోసాగా తోడు చేసేవాడు. తాను చేయగలిగింది చేసి, తనకు తెలిసిన వాళ్లకు తెలిపి, ఆ అవతలి వాళ్ల అవసరానికి ఆదుకునేలా చేసేవాడు. ఆ విధంగా ఆయన మనుషుల మధ్య ఒక వారధిలా ఉండేవాడు. ఏ ఊరు వెళ్లినా పాత పరిచయాలను మరిచేవాడు కాదు. పనికట్టుకొని వెళ్లి మరీ పలకరించేవాడు.


మానవ సంబంధాల పట్ల ఆయనకు ఎందుకంత ప్రత్యేకమైన ప్రేమ అంటే– అది కామ్రేడ్ మేకా సూరిబాబు గారి నుంచి అలవర్చుకున్న వరవడి. దానిని అందిపుచ్చుకొని, జీవితాంతం పాటించాడు. చాలా సాధారణ ఆర్థిక స్థితి అయినప్పటికీ– వారిల్లు ఎప్పుడూ అనేకమందికి ఓ సొంతిల్లులా ఉండేది. వచ్చిన వారిని ఆదరించటంలో శారద గారి ప్రేమా, శ్రద్ధా చాలా గొప్పవి. వారిద్దరూ సమానమైన ప్రేమాస్పదులు కాబట్టే– వారి రెండు

సత్తిబాబు... కేరాఫ్ సూరిబాబు గారి బడి

కుటుంబాల తరపు బిడ్డలకు, విద్యార్థి ఉద్యమ మిత్రులకు ఆ ఇల్లు ఎంతో ఆదరమైన నిలయమైంది. అవసరం ఎంత పెద్దదైనా సరే– ఆ సమయాన ఒకరికొకరు సహకరించుకుంటే– సమస్య నుంచి సులభంగా గట్టెక్కిపోవొచ్చు. ఈ చిన్న సూత్రం ఎర్రమనాయుడు – సత్తిబాబు గార్ల కుటుంబంలో ఎల్లప్పుడూ ఆచరణలో ఉండేది. కూతుళ్లూ అల్లుళ్లూ కూడా అదే పాటించారు.

ఈ ఉమ్మడితనానికి పునాది గౌరి, శారద గార్ల తండ్రి కామ్రేడ్ మేకా సూరిబాబు గారి కుటుంబ నిర్మాణంలో ఉంది. ఆయన కమ్యూనిస్టు ఆచరణను కుటుంబం మొత్తానికి అన్వయించి, ప్రతి సందర్భాన్ని అందుకు ఉపయోగించారు. నిరాడంబరంగా బతకటం గురించి, ఉన్న వాటితోనే పొదుపుగా, ఉన్నతంగా వండుకోవటం గురించి, అందరూ కలిసికట్టుగా సంబరంగా బతకటం గురించీ నేర్పించారు. ఆచరణలో చూపించారు. ఉద్యమాల్లో తీరిక లేని తరుణాల్లో కూడా కుటుంబాల్లోని పిల్లలకు, యువతీ యువకులకు, మహిళలకు, మగవాళ్లకు విడివిడిగా, ఉమ్మడిగా సమావేశాలు జరిపేవారు. వాళ్ల వాళ్ల సమస్యలు, ఆలోచనలు, అవసరాల గురించి మాట్లాడించేవారు. వాటిని ఎలా పరిష్కరించుకోవాలో, ఎలా పంచుకోవాలో, ఎలా నెరవేర్చుకోవాలో వాళ్లతోనే మాట్లాడించి, ఒక ఉమ్మడి ఆచరణను రూపొందించేవారు. అందుకనే కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం జరిగితే – అది కుటుంబ పండగగా, ఊరుమ్మడి పర్వదినంలా మారిపోయేది. జెండాలు గుచ్చటం, విస్తళ్లు కుట్టడం, కూరగాయలు తరగటం, వండటం, వడ్డించటం – ఇలా ఎవరు చేయగలిగిన పనిని వారు చేసేవారు. సూరిబాబు గారి దృష్టిలో – 'పార్టీ కార్యక్రమం చేయాల్సివస్తే అందరిదీ, వ్యక్తిగత సమస్య అయితే ఎవరికొస్తే వారిదీ కాదు.' సమస్య అయినా, సంతోషమైనా అది అందరిదీ. పంచుకోవాల్సిందే! సమస్యను పంచుకుంటే తేలికైపోతుంది. సంతోషాన్ని పంచుకుంటే ఒకటికి పదింతలవుతుంది.

'కలిసి ఉంటే కలదు బలం' అన్నది సూరిబాబు గారు కుటుంబానికి నేర్పించిన జీవన సూత్రం. అది ఇప్పటికీ వారి కుటుంబాల్లో సజీవంగా కనిపిస్తుంది. మార్క్సిజం అనే ఒక మానవీయ సిద్ధాంతాన్ని అడుగడుగునా అన్వయించుకోవటం ఎలాగో,



మేకా సూరిబాబు




డి.సత్తిబాబు

తారసపడిన ప్రతి మనిషి హృదయాన్నీ తాకటం ఎలాగో – సూరిబాబు గారి డైరీలు చదివితే తెలుస్తుంది. ఆయన తిరిగిన ఊళ్లు, కలిసిన మనుషులూ, వాళ్ల వాళ్ల సమస్యలూ, వాటికి గల పరిష్కారాలూ, దాని కోసం చేయాల్సిన కార్యక్రమాలూ, మధ్య మధ్యలో కుటుంబంలోని పిల్లల, పెద్దల ప్రస్తావనలూ ... ఆయన వ్యక్తిత్వాన్ని మన కళ్లకు కట్టిస్తాయి. గౌరి, శారద, ఎర్రమ నాయుడు, సత్తిబాబూ ... ఆయన ఒడిలో, బడిలో ఎదిగినవాళ్లు. ఆయన వదిలి వెళ్లిన వారసత్వాన్ని తలకెత్తుకున్న వాళ్లు.

- సత్యాజీ

సత్తిబాబుకు జోహార్లు



కామ్రేడ్ డి.సత్తిబాబు భార్య శారద, కుమారులు అమర్‌బాబు, డాక్టర్ అజయ్‌బాబు, ఇతర కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. మే 20న ఆస్పత్రికి వెళ్లేలోగా గుండెపోటుతో సత్తిబాబు చనిపోవడం చాలా బాధాకరం. 40 సంవత్సరాలకు పైగా సత్తిబాబుతో పరిచయముంది. ఆ నాటికి సిపిఎం ఉద్యమం విశాఖ నగరం, అనకాపల్లికి పరిమితమై వుంది. నర్సీపట్నం, విశాఖ ఏజెన్సీకి తీగలాగ సిపిఎం పాకడానికి తమశక్తినంతా కామ్రేడ్ సత్తిబాబు, గౌరి ధారపోశారు. చింతపల్లి ఏజెన్సీలో పార్టీ పెరగడానికి పునాదిగా సత్తిబాబు పనిచేశారు. వర్గపోరాట సిద్ధాంతాన్ని గట్టిగా నమ్మిన నాయకునిగా జీవితాంతం పనిచేశారు. నెలరోజుల క్రితం గ్రామీణ సర్వే వర్క్‌షాప్ సందర్భంగా అనకాపల్లిలో కలిశాం. చెట్టుపల్లిలో భవన నిర్మాణ కార్మికుల భవనం నిర్మాణం పూర్తవుతోంది. భవన ప్రారంభానికి రావాలని కోరాడు.

సత్తిబాబు సౌమ్యుడు. మితభాషి, ఎదుటవారిని నొప్పించకుండా నచ్చుజెప్పేవాడు. తనకంటే పెద్ద వయస్కులైన సాపిరెడ్డి నారాయణమూర్తి, తలారి సత్యనారాయణ వంటి వారిని సమన్వయం చేసుకుంటూ, అనేక మంది చిన్నవారిని ఉద్యమంలోకి ఆకర్షించగలిగారు. సత్తిబాబు కుటుంబంతో పాటు త్రిమూర్తులు రెడ్డి, సూర్యప్రభ కుటుంబం, వారి ఇళ్లు 30 సంవత్సరాల పాటు ఉద్యమ కేంద్రాలుగా ఉన్నాయి. వారూ ఉద్యమంలో పాల్గనేవారు. నాన్‌షెడ్యూల్ మండలాల పాదయాత్రలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. బాక్సైట్, చింతపల్లి కాఫీ కార్మికుల ఉద్యమాలకు నర్సీపట్నం కేంద్రం. ఏ బాధ్యత అప్పగించినా సత్తిబాబు అమలు చేసేవారు. నర్సీపట్నం ట్రేడ్ యూనియన్‌లకు సీనియర్ నాయకునిగానూ, సిఐటియు జిల్లా ఆఫీసు బేరర్‌గానూ సత్తిబాబు ఎంతో కృషి చేశారు. నర్సీపట్నం ప్రాంతంలోని ముఠా, బిల్డింగ్, ఆటో, అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, కాఫీ వంటి రంగాలన్నింటికీ ఆయనే నాయకుడు. తలారి సత్యనారాయణ ఉన్నప్పుడు ఇద్దరూ కలిసి ఉద్యమాన్ని నడిపారు. ఆయన చనిపోయిన తరువాత కార్మికోద్యమం బాధ్యతంతా తన భుజస్కంధాలపై వేసుకున్నారు. ఎస్‌ఎఫ్‌ఐ నుంచి వచ్చిన రాజుతో కలిసి కోటేశ్వరరావు సహాయంతో కార్మికుల కష్టాలను తీర్చడంలో విశేష కృషి చేశారు. సత్తిబాబు లేని లోటు నర్సీపట్నానికికే కాకుండా అనకాపల్లి జిల్లాకే తీరనిది.

- సిహెచ్ నర్సింగరావు,
సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

నిబద్ధత కలిగిన కామ్రేడ్



కామ్రేడ్ దుంపలపూడి సత్తిబాబు హఠాన్మరణం నన్ను తీవ్రమైన ఆవేదనకు గురి చేసింది. సత్తిబాబుతో సుదీర్ఘమైన అనుబంధం ఉంది. ఇద్దరం అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) నిర్మాణంలో కలసి పని చేశాం. 1982 ప్రాంతంలో ఎఐవైఎఫ్ రాజకీయ శిక్షణ తరగతులకు హాజరైన సత్తిబాబు వామపక్ష రాజకీయాలకు ఆకర్షితులయ్యారు. అనంతరం ఎఐవైఎఫ్ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి విశాఖ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో సభ్యత్వం తీసుకుని పార్టీ విస్తరణకు కృషి చేశారు. కారణాంతరాలేవైనా సిపిఐ నుంచి బయటకు వెళ్లిన సత్తిబాబు సిపిఎంలో రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించి, కన్నుమూసే వరకు కమ్యూనిస్టు నిబద్ధతకు మారు పేరుగానే నిలిచారు. నర్సీపట్నం కార్యక్షేత్రంగా కార్మిక సంఘాల నిర్మాణం చేసి మంచి కార్మికోద్యమ నేతగా గుర్తింపు పొందారు. మార్క్సిస్టు సిద్ధాంతం పట్ల నిబద్ధత కలిగిన నేత. కమ్యూనిస్టు ఆదర్శాలను జీవితాంతం కొనసాగించారు. వ్యక్తిగతంగా నేనంటే వల్లమాలిన ప్రేమ. వేర్వేరు రాజకీయ పార్టీల్లో కొనసాగినా మా మధ్య స్నేహ సంబంధాలు కొనసాగాయి. విశాఖపట్నం ఎప్పుడొచ్చినా ఫోన్ చేసేవారు. కలువకుండా, మాట్లాడకుండా వెనుతిరిగేవారు కాదు. సత్తిబాబుకు అమరజీవి కామ్రేడ్ మేకా సూరిబాబు గారి రెండో అమ్మాయి శారదతో వివాహం జరిగిన సమయంలో నేను ఉన్నాను. సూరిబాబు గారి హత్య అనంతరం ఆ కుటుంబానికి సత్తిబాబు అన్ని విధాల అండగా ఉన్నారు. కుటుంబ సభ్యుల్ని కాపాడుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. మానవ సంబంధాలను కొనసాగించడంలో సత్తిబాబు ప్రత్యేకత కలిగిఉండేవారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే అయినా ఆ కుటుంబాన్ని చాలా జాగ్రత్తగా చూసుకున్నారు. పిల్లలకు మంచి విద్యను అందించారు. తన చుట్టూ ఉన్న సమాజాన్ని జాగృతం చేస్తూనే కమ్యూనిస్టు ఉద్యమ విస్తరణకు కృషి చేస్తున్న క్రమంలో హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందడం అత్యంత బాధాకరం. మేకా సూరిబాబు గారి పెద్దల్లుడు ఎర్రమ నాయుడు కూడా సత్తిబాబు తరహాలోనే హఠాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు. ఆ కుటుంబంలో అలాగే ఈ విషాదం చోటు చేసుకోవడం – ఆ కుటుంబానికి, సత్తిబాబుతో స్నేహ సంబంధాలున్న అందరికీ తీరని ఆవేదనను మిగిల్చింది. ఈ పెను విషాదం నుంచి ఆ కుటుంబ సభ్యులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. సత్తిబాబు కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేస్తున్నాను.

- జెవి.సత్యనారాయణమూర్తి,
సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఎర్రజెండా ఎదుగుదలకు ఎనలేని కృషి



కామ్రేడ్ సత్తిబాబు హఠాన్మరణం గురించి ఒక రౌండ్ టేబుల్ సమావేశంలో నేను పాల్గొంటున్నప్పుడు– కామ్రేడ్ త్రిమూర్తులు రెడ్డి నా చెవిన వేశారు. ఉన్నట్టుండి మెదడు మొద్దుబారినట్టయింది. సత్తిబాబుతో నాకు 1995 నుంచీ ఏర్పడిన పరిచయం, ఉద్యమ ప్రస్థానంలో ఎదురైన అనుభవాలూ నా మనసులో కదలాడుతూనే ఉన్నాయి. ప్రజా ఉద్యమాలకే జీవితమంతా వెచ్చించిన ఆ కామ్రేడ్ ఆ ఉద్యమ బాధ్యతల నిర్వహణ క్రమంలోనే అసువులు బాసారు.

పార్టీ రాజకీయ కార్యక్రమాన్ని, ఆచరణను కొంతకాలం పాటు పరిశీలించిన తర్వాతనే సత్తిబాబు సిపిఐ (ఎం)లో చేరాలని నిర్ణయించుకున్నారు. అలా చేరే సందర్భంలో ఎటువంటి ముందస్తు షరతులూ పెట్టలేదు. ఫలానా పదవి కావాలని ఏనాడూ కోరలేదు. దాదాపు మూడు దశాబ్దాల పాటు పట్టిన జెండాను వీడలేదు. తన సామర్థ్యం ఏమిటో, తన పరిమితులు ఏమిటో స్పష్టంగా తెలిసిన వ్యక్తి సత్తిబాబు. ఏ విషయమ్మీదనైనా ఆచి తూచి మాట్లాడే స్వభావం ఆ కామ్రేడ్‌ది. అందుచేత ఆ విషయంలో స్పష్టత ఉండేది. నర్సీపట్నం ప్రాంతంలో ఎర్రజెండాను నిలబెట్టడానికి ఆయన శక్తివంచన లేకుండా కృషి చేశారు. ఉద్యమం ప్రతికూల వాతావరణంలలో సాగుతున్న కాలంలో ఆ విధమైన కృషిని ఎటువంటి ఊగిసలాటలూ లేకుండా కొనసాగించడం చిన్న విషయమేమీ కాదు.

కామ్రేడ్ సత్తిబాబు అకాల మరణం వల్ల జిల్లా ఉద్యమంలో కలిగిన లోటును భర్తీ చేయడానికి మనమందరమూ పట్టుదలగా కృషి చేయడమే ఆ కామ్రేడ్‌కు నిజమైన నివాళి. కామ్రేడ్ శారదకు, పిల్లలకు, ఇతర కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- ఎంవిఎస్.శర్మ
మాజీ ఎమ్మెల్సీ

కార్యదక్షుడు .. కార్మిక మిత్రుడు



కామ్రేడ్ డి.సత్తిబాబు కార్యదక్షత కల్గిన కమ్యూనిస్టు. మార్క్సిస్టు పార్టీ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా ప్రజలను కదిలించేవారు. పార్టీ అప్పగించిన పనిని సమర్థవంతంగా అమలు చేసేవారు. ఆ పని తుదిశ్వాస విడిచేవరకు కొనసాగించిన ఉత్తమ కమ్యూనిస్టు. చనిపోయిన రోజు ఉదయం కూడా ఉపాధి కూలీలు పనిచేసిన ప్రాంతానికి వెళ్లచ్చారు. ప్రజాశక్తి సర్క్యులేషన్ క్యాంపెయిన్ విషయంపై చర్చించడానికి ఆ బాధ్యులతో సమావేశానికి వెళ్లాలని బయలుదేరుతున్న సమయంలో గుండెపోటు రూపంలో ఆయన్ను మృత్యువు కబళించింది.

సత్తిబాబు చిన్ననాటి నుంచి కమ్యూనిస్టు భావాలు కలిగిన వ్యక్తి. నేను విద్యార్థి ఉద్యమంలో ఉండగా ఆయనతో పరిచయం ఏర్పడింది. నాడు ఆయన యువజన రంగంలో ఎంతో చురుగ్గా పనిచేసేవారు. 1997లో నర్సీపట్నంలో రాష్ట్ర యువజన రంగం క్లాసులు నిర్వహించడంలో కీలకమైన ప్రాత పోషించారు.

పార్టీ పనిని ఆయన ఏనాడూ కష్టంగా భావించలేదు. అప్పగించిన పనిని మనస్ఫూర్తిగా అమలు చేసేవారు. ఏ కష్టమొచ్చినా తట్టుకొని నిలబడే స్వభావం ఆయనది. ఎదుటవారికి ధైర్యం కల్పించే వ్యక్తిత్వం ఆయన సొంతం. ఎవరినీ నొప్పించేవారు కాదు. నర్సీపట్నం ప్రాంతంలో వివిధ కార్మిక సంఘాలకు నాయకత్వం వహించారు. వివిధ పోరాటాలు ముందుండి నడిపారు.

ఆ రోజుల్లోనే వాళ్ల నాన్నగారు టీచర్‌గా పనిచేసేవారు. సత్తిబాబు ఉన్నత చదువులు చదువుకొని, మంచి ఉద్యోగం చేసుకొనే అవకాశాల్ని వదులుకొని, కష్టజీవుల కోసం పనిచేసే కమ్యూనిస్టు పార్టీలో పనిచేయాలనుకున్నారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు మేకా సూరిబాబు ప్రోత్సాహంతో కమ్యూనిస్టు పార్టీలో చేరారు. నమ్మిన సిద్ధాంతానికి చివరి వరకు కట్టుబడి ఉన్నారు. తన తుది శ్వాసవిడిచే వరకు ఎర్రజెండా నీడలో కార్మిక, కర్షక అణగారిన వర్గాల అభ్యున్నతికి పనిచేశారు. పార్టీ కార్యకర్తలు ఏ స్థాయికల్గినవారైనా ఆయన ఇంటికి వెళితే ఎంతో ఆదరించేవారు.

ఆయన కులాంతర వివాహం చేసుకోవడమే కాకుండా, కుటుంబ సభ్యులను కులాంతర వివాహాలకు ప్రోత్సహించారు. కులవివక్షకు వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తి. పిల్లలను ఉన్నతమైన చదువులు చదివించి ప్రయోజకుల్ని చేశారు. సమాజం పట్ల ఎంత గౌరవంతో ఉండేవారో కుటుంబం పట్ల కూడా అంతే బాధ్యతతో మెలిగిన వ్యక్తి. తన తోడల్లుడు కుటుంబం, తన కుటుంబం ఉమ్మడి కుటుంబం సాగడం ఒక విశిష్టత.

నర్సీపట్నం ప్రాంతంలో సిపిఎం అభ్యున్నతికి నిరంతరం శ్రమించారు. పార్టీ సిద్ధాంతాలకు, విలువలకు కట్టుబడడమే కాకుండా రాజకీయ పరిణితి గల వ్యక్తి. నేను ఉమ్మడి విశాఖ జిల్లా, ప్రస్తుత అనకాపల్లి జిల్లా కార్యదర్శిగా మా టీములో ఆయనతో కలిసి పనిచేసే అవకాశం కలిగింది. ఆయన ఏ సందర్భంలోనూ కోపం ప్రదర్శించినట్లు చూడలేదు. ఎంతో సౌమ్యంగా, నెమ్మదిగా, చెప్పాలనుకొనే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పేవారు. ఆయన మరణాంతరం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల సభ్యులు వందలాదిగా వచ్చి అంతిమ యాత్రలో పాల్గన్నారంటేనే ఆయన చేసిన త్యాగానికి నిదర్శనం.

ఆయన అకాల మరణం సిపిఎం పార్టీకి, నర్సీపట్నం ప్రాంతంలో వున్న కార్మికులు, కర్షకులకు, బడుగు బలహీన వర్గాలకు తీరని లోటు. ఆయన ఏ ఆశయం కోసం పనిచేశారో దాని సాధనకు పనిచేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి.

- కె.లోకనాథం,
సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి

కష్ట జీవుల పక్షపాతి



1997లో నర్సీపట్నంలో జరిగిన డివైఎఫ్ఐ రాష్ట్ర రాజకీయ శిక్షణ తరగతులు సందర్భంగా డి.సత్తిబాబు గారితో తొలి పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరం కలిసి అనేక పోరాటాల్లో పాల్గన్నాం. కలిసి పనిచేశాం. రెండున్నర దశాబ్దాల పోరాట, ఉద్యమ అనుబంధం కల్గిన వ్యక్తి లేరన్న సత్యాన్ని నమ్మలేకపోతున్నాను. మరణానికి రెండ్రోజుల ముందే కలిసి మాట్లాడిన సహచరుడు ఇక శాశ్వతంగా కన్పించడన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేకపోతున్నాను. ఎప్పుడూ ప్రజల మధ్యవుంటూ, కార్మికులు, కష్టజీవుల కోసం పనిచేస్తూ, వారి హితం కోసం పరితపించి పనిచేసిన వ్యక్తి సత్తిబాబు. అనారోగ్య, ఆర్థిక సమస్యలచ్చిన సందర్భంలోనూ ఆయన ఏనాడూ వెనక్కి తగ్గలేదు. పోరాట పంథా వీడలేదు. ఊగిసలాడలేదు. ఆయనతో కలిసి పనిచేసిన సుదీర్ఘ ప్రయాణంలో సత్తిబాబులో నిరాశ, అలసట, అసహనం, కోపం ఎప్పుడూ చూడలేదు. కష్టజీవుల కోసం చిత్తశుద్ధితో పనిచేయడం తప్ప– తీవ్ర భావోద్వేగాలు ప్రదర్శించడం తెలీదు. ఆయన ముఖంలో చిరునవ్వు తప్ప ఎంత పనిఒత్తిడిలోనూ విముఖత కన్పించేది కాదు. కష్టాన్ని సత్తిబాబుతో చెప్పుకుంటే ఎంతో ఓదార్పు లభించేది. ధైర్యం చెప్పేవారు. మనమెన్ని కష్టాల్లోవున్నా ప్రజలతో కలిసి పనిచేయడంలోనే ఆనందం ఉంటుందంటూ నూతనుత్తేజం కల్గించేవారు. సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీలో వయసులోనూ, అనుభవంలోనూ పెద్దతను. కార్మికోద్యమానికి అనుభవం కల్గిన నాయకుల సూచనలు ఎంతో అవసరం. కార్మికవర్గంపై పాలకవర్గం కర్కశంగా వ్యవహరిస్తున్న ఈ రోజుల్లో ఉద్యమ నిర్మాణం పట్ల దక్షత కల్గిన నాయకత్వం మరింత అవసరం. దోపిడీవర్గాల ఆర్థిక ప్రయోజనాల కోసం కష్టజీవుల హక్కులు, చట్టాలపై ఎక్కుపెట్టిన దాడులను ప్రజాప్రతిఘటన ద్వారా తిప్పికొట్టాల్సిన ఈ కాలంలో ఆయన మరణం ఉద్యమానికి తీరనిలోటు. నర్సీపట్నం ప్రాంతంలో అసంఘటిత రంగ కార్మికులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ఈ రంగంలో పనిచేసిన వారికి ఎంతో ఓర్పు, పట్టుదల ఉండాలి. ఇవి సత్తిబాబులో ఉన్నాయి. అసంఘటిత రంగ కార్మికులపై అమితమైన ప్రేమ చూపేవారు. ఉదయం 5 గంటలకు కృష్ణ బజార్‌కు వెళ్లి ముఠా కార్మికులను కలవడం ఆయన దినచర్యలో భాగంగా ఉండేది. పంచాయతీ, మున్సిపల్, కాఫీ, భవన నిర్మాణ కార్మికులు; ఆటో, తోపుడు బళ్లు, జీడి పిక్కల పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారు.అర్ధరాత్రైనా కష్టమొచ్చిన కార్మికుడికి విసుగు చెందకుండా సహాయపడేవారు. నిజాయితీ, నిబద్ధత ఆయనలోని ప్రత్యేక సుగుణాలు. చేనేత కార్మిక సంఘం బాధ్యతలు నిమిత్తం నర్సీపట్నం ప్రాంతంలో ఇద్దరం కలిసి పనిచేశాం. నాతవరం, మాకవరపాలెం, వేములపూడి ప్రాంతాల్లో చేనేత కార్మిక సహకార సంఘాలున్నాయి. చేనేత కార్మికులను సమీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. సహకార రంగంలో జరిగిన అవినీతిని బయటకు తీసి చేనేత కార్మికులకు న్యాయం చేశారు. మాకవరపాలెంలోని బాక్సైట్ అన్‌రాక్ అల్యూమినియం పరిశ్రమలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపారు. ఈ పోరాట సందర్భంగా ఇద్దరమూ నర్సీపట్నం సబ్‌జైల్లో ఏడు రోజుల పాటు ఉన్నాం. నర్సీపట్నం ప్రాంతంలోని జీడిపిక్కల పరిశ్రమల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్న మహిళలను సంఘటితం చేసి దాదాపు రెండు నెలలు సమ్మె నిర్వహించాం. ఈ సమ్మెలో సత్తిబాబు చురుకైన పాత్ర వహించారు. నా వివాహం నర్సీపట్నంలో జరగడంతో సత్తిబాబు గారి ఇంటికి వెళ్లాను. ఈ రోజుతో మీరు మా ఊరు మనిషి అయిపోయారని కలుపుగోలుగా మాట్లాడారు. నర్సీపట్నంలో జరిగిన సిఐటియు జిల్లా మహాసభ విజయవంతానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఉద్యమ వారసత్వ కుటుంబం నుంచి సత్తిబాబు రావడంతో ఆయన పట్ల ప్రత్యేక గౌరవం ఉండేది. కుటుంబంలో ఎన్ని ఇబ్బందులున్నా, అనారోగ్య సమస్యలున్నా నిత్యం ప్రజల కోసం పరితపించే సత్తిబాబు నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను.

- జి.కోటేశ్వరరావు,
సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి

అజాత శత్రువు



దుంపలపూడి సత్తిబాబు స్నేహశీలి. అజాతశత్రువు. నేను కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో ఉన్నప్పటికీ ఆయనతో అనుబంధం ఎంతో ఉంది. రాజకీయ పార్టీలకు అతీతంగా ఆయన మెలిగేవాడు. కార్మికుల సమస్యలపై పోరాటాలు చేసేవారు. కొన్ని సందర్భాల్లో ఆయన ఆదర్శాలతోనే నేను రాజకీయం చేసే వాడిని. మేము రాజకీయం, కుటుంబ విషయాలపై చర్చించుకునే వాళ్లం. ఏదైనా సమస్య వచ్చినప్పుడు చిరునవ్వు ఆయుధంగా చేసుకొని ఆ సమస్యలను పరిష్కరించేవారు. కార్మిక సంఘాలు ఏర్పాటు చేయడం, నమ్మిన సిద్ధాంతాల కోసం నిర్విరామ కృషి చేయడం ఆయన గొప్పతనం. అటువంటి సత్తిబాబు ఆఖరి క్షణం వరకు పోరాటాలలోనే ఉంటూ ప్రాణాలు వదలడం చాలా బాధాకరం. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే ఆయన ఆత్మకు శాంతి కూరుతుందని, అదే అతనికి ఘన నివాళిగా భావిస్తున్నాను.

- మీసాల సుబ్బన్న,
కాంగ్రెస్ నాయకులు, నర్సీపట్నం

నమ్రత, నిబద్ధత సత్తిబాబు సొంతం



మూడు దశాబ్దాలుగా కలిసి ఉద్యమ ప్రయాణం చేసిన మంచి మిత్రుడ్ని, సహచరుడ్ని కోల్పోయాను. కమ్యూనిస్టు నాయకుడు మేకా సూరిబాబు ప్రేరణతో ఆకర్షితుడైన సత్తిబాబు హైస్కూల్ స్థాయిలో చదువుకు స్వస్తి చెప్పి, యువజన నాయకుడిగా అనేక పోరాటాల్లో పాల్గన్నారు. తదనంతరం అప్పటి విశాఖపట్నం జిల్లా సిపిఎం కార్యదర్శి బివి.రాఘవులు ప్రోత్సాహంతో సిపిఎంలో చేరి నర్సీపట్నం కేంద్రంగా పనిచేశారు. మూడు దశాబ్దాలుగా కార్మికులు, కష్టజీవులతో మమేకమై అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. ఈ కాలమంతా ఆయనతో కలిసి పనిచేశాను. సాధారణ కార్యకర్త నుంచి సిపిఎం జిల్లా కమిటీ సభ్యుని స్థాయికి ఎదిగారు. సిఐటియు నర్సీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులుగా పనిచేశారు. నమ్మిన ఆశయానికి కట్టుబడి అంకితభావంతో పనిచేసిన మంచి కార్యకర్త. నర్సీపట్నంలో అనేక కార్మిక సంఘాలకు ఆయన నాయకత్వం వహించారు. 'సొంతలాభం కొంత మానుకు పొరుగు వానికి తోడుపడవోయ్' అన్న గురజాడ అప్పారావు సందేశ సారాన్ని వంటబట్టించుకొని ఆచరణలో పెట్టారు. ఇతర పార్టీ నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగివుండేవారు. కుటుంబం పట్ల బాధ్యతగా ఉంటూ, ఇద్దరు కుమారులను ప్రయోజకుల్ని చేశారు. సత్తిబాబు జీవిత సహచరి శారద అనారోగ్యంతో బాధపడుతున్నా, కార్యక్రమాలు, ఉద్యమాల పట్ల ఏనాడూ ఆయన వెనక్కి తగ్గలేదు. ఉద్యమ కార్యాచరణలోనే ఆయన తన ప్రాణాలు కోల్పోయారు. సత్తిబాబు ఆశయ సాధనకు పట్టుదలతో పనిచేసి, ప్రజా ఉద్యమాలు నిర్మించడమే ఆయనకు ఘనమైన నివాళి. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేస్తున్నాను.

-కె.త్రిమూర్తులురెడ్డి,
ఉద్యమ సహచరుడు

స్నేహంగా ఉండేవారు

మా ఊరొస్తే అందరినీ పలకరించి, కష్టసుఖాలు తెలుసుకొని వెళ్లేవారు. ఎక్కడైనా కన్పిస్తే ఊరు బాగోగులు అడిగేవారు. మంచిపని చేసిన వారెవరైనా సహకరించేవారు. పూరు నుంచి నర్సీపట్నం వెళ్లినప్పుడు కలిసేవాడిని. సత్తిబాబు కూడా వారానికి ఒకసారైన నాగాపురం వచ్చేవారు. పేద ప్రజలంటే బాగా ఇష్టపడేవారు. వాళ్ల సమస్యలపై పనిచేసేవారు. నర్సీపట్నంలో కార్మికుల కోసం కష్టపడ్డారు. ఎవరితోనూ విరోధంగా ఉండేవారు కాదు. అందరితో స్నేహంగా ఉండేవారు.



- యలమంచిలి రఘురామచంద్రరావు,
సిహెచ్.నాగాపురం సర్పంచి

నవ్వే.. సత్తిబాబు ఆయుధం



మా కుటుంబానికి రాజకీయ నేపథ్యం కలిగి ఉండడంతో డి.సత్తిబాబుతో రెండు దశాబ్దాల క్రితం నాకు పరిచయం ఏర్పడింది. ఆయన పోరాటాలకు ఆకర్షితుడనై వారికి దగ్గరయ్యాను. మా మధ్య స్నేహభావం ఏర్పడింది. నర్సీపట్నం పంచాయతీ నుంచి మున్సిపాలిటీ వరకు కార్మికుల సమస్యల పట్ల ఆయన ఎంతో నిర్విరామ కృషి చేసేవారు. కార్మికులకు న్యాయం చేయడానికి ఎన్నో పోరాటాలు చేశారు. రాజకీయంగా నాకు కొన్ని సలహాలు, సూచనలు అందించేవారు. అటువంటి సత్తిబాబు ఈ రోజు మన మధ్య లేకపోవడం చాలా బాధ వేస్తుంది. పార్టీలు వేరైనప్పటికీ ప్రతి ఒక్కరికీ నవ్వుతూనే సమాధానం చెప్పడం ఆయన ఆయుధం. నాకు కార్మికులు అంటే ఎంతో ఇష్టం. అటువంటి ముఠా కార్మికులకు సమస్యలు వచ్చినప్పుడు నాతో చర్చించడంతో ఇరువురు భావాలు కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేసే వాళ్లం. ఈ భావాలే అతని పట్ల నన్ను ఆకర్షించేలా చేశాయి. ఇద్దరం ఒకే అభిప్రాయంతో సమస్యలను పరిష్కరించే వాళ్లం. సమస్య జటిలం కాకుండా చూసేవారు.

నాకు నియోజకవర్గంలో సిపిఐ, సిపిఎం నాయకులతో పరిచయం ఉంది ఎంతో మందితో పరిచయం ఉన్నప్పటికీ సత్తిబాబుతోనే ఎక్కువగా బంధం ఏర్పడింది. ఆయన జీవితం మొత్తం పార్టీకి అంకితం చేశారు. నేను మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా ఉన్న సమయం నుంచి కార్మికులకు ఒక భవనం ఏర్పాటు చేయాలని ఆయన తపన పడేవారు. ముఠా కార్మికులందరూ కలిసి చర్చించుకోవడానికి ఏదైనా ఒక భవనం ఉంటే బాగుంటుందని, నర్సీపట్నం మున్సిపాలిటీలో ఒక భవనం ఏర్పాటు చేయాలని నాతో చెప్పారు. దానిపై నేను ఇప్పటికే ప్రజాప్రతినిధులను, అధికారులను కలవడం జరిగింది. ఆయన ఆఖరి కోరిక తీర్చేందుకు నేను కృషి చేస్తాను.

- చింతకాయల సన్యాసి పాత్రుడు (జమీలు)
వైసిపి నర్సీపట్నం నియోజకవర్గ నాయకులు

స్వార్థం లేని వ్యక్తి



డి.సత్తిబాబు... కమ్యూనిస్టు సిద్ధాంతానికి కట్టుబడి పనిచేశారు. మంచి వ్యక్తి. స్వార్థం లేదు. ఆయనతో కలిసి కొంతకాలం పనిచేశాను. చనిపోయే వరకు కమ్యూనిస్టు భావజాలంతో ఉన్నారు. చీడిగుమ్మల, ఎర్రవరం, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో భూ సమస్యలపై పోరాడాం. పాతూరు నుంచి నర్సీపట్నం వరకు అంబలి యాత్రలు నిర్వహించాం. పేదలందరికీ కూడు, గుడ్డ, గూడు కావాలని కమ్యూనిస్టులు చేసిన పోరాటం మరింత విస్తృతం కావాలి. దోపిడీదారుల ప్రయోజనాల కోసం పేద, మధ్య తరగతి వర్గాలపై పాలకవర్గం విపరీతమైన భారాలు వేస్తోంది. ఈ పరిస్థితుల్లో పోరాటాలు ఉధృతం కావాలి. పేదలకు అండగా నిలబడి పనిచేసే వ్యక్తులు పెరగాలి. నిరంతరం పేదల కోసం పనిచేసే డి.సత్తిబాబు మరణించడం బాధాకరం. ఆయన లేని లోటును భర్తీ చేసుకొని, ప్రజా ఉద్యమాలు నిర్మించాలి.

- వారా నూకరాజు, కొయ్యూరు జెడ్‌పిటిసి

మా గుండెల్లో మీ జ్ఞాపకాలు పదిలం



కొంత మందికి జననమే ఉంటుంది.. మరణం ఉండదు. అలాంటి మహోన్నత వ్యక్తి మా మావయ్య సత్తిబాబుగారు అని చెప్పుకోవడానికి మాకెంతో గర్వంగా ఉంది. ఒకవైపు కుటుంబ బాధ్యత. మరోవైపు సామాజిక బాధ్యత. లోలోపల వెల్లువెత్తే సంఘర్షణ.. అయినా ఏనాడూ కుటుంబాన్ని వదలలేదు. ప్రజల కష్టాలనూ విడవలేదు. తన అష్టకష్టాలనే కాగడాగా వెలిగించిన గొప్ప వ్యక్తి. ఆ వెలుగుల్లో ప్రజల్ని చైతన్యం చేశాడు. కుటుంబానికి దారి చూపించాడు.

పలకరింపులు కూడా కష్టమైపోతున్న ఈ రోజుల్లో.. నవ్వులు రాకుండా నవ్వులు నటించి.. ముక్తసరిగా మాట్లాడుకునే ఈ కాలంలో.. ప్రతి ఒక్కర్నీ మనసుకు హత్తుకునేలా పలకరించే వ్యక్తుల్లో ఆయన ప్రథముడు. ఎందుకంటే ఆయనకు నటన తెలియదు.. ఈర్ష్య తెలియదు.. ద్వేషం తెలియదు.. కోపం తెలియదు.. స్వార్థం అంతకంటే తెలియదు. ఆయన భౌతికంగా దూరమైన రోజున కన్నీటి నివాళి అర్పించేందుకు నలుగురు, పదులు, వందలుగా తరలివచ్చిన అభిమానగణంతో నల్లని తారురోడ్డు సైతం ఎర్ర సముద్రంలా మారిపోయింది. అంతకంటే ఆయన గొప్పతనాన్ని వేరే విడమర్చి చెప్పాలా!

ఆయన భౌతికంగా దూరమైనా.. ఎర్రజెండా ఉన్నన్ని రోజులూ.. ఆయన బతికే ఉంటారు. కుటుంబసభ్యులంతా కలిసి ఉన్నంతవరకూ సజీవంగా మనందరి మనసుల్లో నిలిచే ఉంటారు. అందుకే.. ఆయనకు జననం తప్ప మరణం లేదు.

- యర్రా నాగేశ్వరరావు

మంచి స్నేహితుడ్ని కోల్పోయాను



చిన్ననాటి నుంచి నాకు సత్తిబాబు మిత్రుడు. పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి ఎంతో నిబద్ధతతో పనిచేశాడు. పార్టీ ఏ పని అప్పగిస్తే ఆ పని ఎన్ని ఇబ్బందులొచ్చినా పూర్తి చేసేవాడు. నర్సీపట్నంలో కార్మిక నాయకుడుగా ఎదిగాడు. కార్మికులకు అండగా నిలిచాడు. కార్మికుల విశ్వాసాన్ని పొందాడు. అజాత శత్రువుగా ఎదిగాడు. ఎప్పుడూ నవ్వుతూనే ఉండేవాడు. కష్టజీవి. ఎలాంటి వ్యసనాలు లేని వ్యక్తి. సత్తిబాబు నాకు చిరకాల మిత్రుడు అని చెప్పుకోడానికి గర్వంగా ఉంది. అలాంటి వ్యక్తి అకాల మరణం జీర్ణించుకోలేకపోతున్నాను. ఎన్నో కష్టాలు తట్టుకొని జీవితాన్ని సాగించాడు. పిల్లలను మంచి వృద్ధిలోకి తీసుకొచ్చాడు.

- చింతల ప్రకాష్, లాయర్, స్నేహితుడు

గొప్ప వ్యక్తిత్వం కల్గిన వ్యక్తి



సత్తిబాబు వ్యక్తిత్వం చాలా గొప్పది. నిజాయితీకి ఆయన ప్రతీక. మంచి మనిషి ఎలా ఉండాలో ఆచరణలో ఆయన చూపించాడు. కమ్యూనిస్టు విలువను పెంచాడు. చివరివరకూ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారు. మంచి మిత్రులను సంపాదించుకున్నాడు. పార్టీ యెడల విశ్వాసంతో వుండి పనిచేశాడు. దోపిడీకి వ్యతిరేకంగా, ప్రజల కోసం, చివరి వరకు నమ్మిన సిద్ధాంతం కోసం నిలబడి కమ్యూనిస్టు పార్టీలో కొనసాగారు.

1979లో నాకు సత్తిబాబుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరం వ్యవసాయ కూలి సంఘంలో పనిచేశాం. సిపిఎం, సిపిఐగా అనేక కార్యక్రమాలు ఉమ్మడిగా కలిసి నిర్వహించాం. ఇందులో సత్తిబాబు చురుగ్గా ఉండేవాడు. అనారోగ్యాన్ని, ఆర్థిక ఇబ్బందులను లెక్కచేయకుండా పనిచేశాడు. పోరాటాల్లో ఎక్కడా రాజీ పడేవాడు కాదు. కలిసినప్పుడల్లా కష్టసుఖాలు మాట్లాడుకొనేవాళ్లం. సత్తిబాబుతోనూ, ఆ కుటుంబ సభ్యులతోనూ మంచి సంబంధాలున్నాయి. ఆ సాన్నిహిత్యంతోనే ఉంటాను. సిపిఎం పద్ధతులకు కట్టుబడి లోపం లేకుండా పనిచేశాడు. ఆయన మరణం పేదల పార్టీకి తీరనిలోటు. ఆయనతో కార్మికులు ఎంతో సన్నిహితంగా ఉండేవారు. తమ కష్టాలను సత్తిబాబుకు చెప్పుకోవాలనేలా కార్మికులతో కలిసిపోయాడు. పార్టీ పిలుపులు పక్కాగా అమలు చేసేవాడు. ఆయనతో నాకున్న అనుబంధం చాలా ఆత్మీయమైనది. కోపం లేని వ్యక్తి. ఎవరికైనా ఏదైనా చెప్పాలన్నా వారు నొచ్చుకోకుండా సున్నితంగా చెప్పేవాడు. అజాత శత్రువులాగే జీవించాడు. అవకాశాలుండీ మేము చేయలేని పని సత్తిబాబు పార్టీ అభివృద్ధికి చేశాడు. ఆయన మరణం చాలా బాధాకరం.

- రుత్తల యర్రాపాత్రుడు, కార్మిక సంఘం నాయకులు, నర్సీపట్నం

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే వ్యక్తిత్వం



దుంపలపూడి సత్యనారాయణ అలియాస్ సిఐటియు సత్తిబాబు నాకు బాల్యమిత్రుడు. చాలా నెమ్మది, అణుకువ, ప్రేమ కలిగిన మంచి స్నేహితుడు. సత్తిబాబు చిన్నప్పటి నుంచి తను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జీవించాడు. తన కుటుంబాన్ని, కట్టుబాట్లను ఎదిరించి కులాంతర వివాహం చేసుకొని ఆనాడే మా యువతకు ఆదర్శంగా నిలిచాడు. తను నమ్మిన సిద్ధాంతాన్ని, ఆ పనిని నెరవేర్చడానికి ఎండనకా, వాననకా తిరిగేవాడు. ఎవరైనా కష్టంలో ఉంటే ఆదుకునే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి తను. నేను అనేక కష్టాల్లో ఉన్నప్పుడు నా దగ్గరకు వచ్చి, "అన్నా ఈ కష్టాలు తాత్కాలికంగా ఉంటాయి, మీరు అందరికీ కావలసిన వారు, మీరు కుంగిపోకూడదు." అని ధైర్యం చెప్పిన మంచి మిత్రుడు. అలాంటి మంచి మిత్రుడు లేకపోవడం నాకు తీరని లోటు. అల్లూరి సీతారామరాజు ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్‌కు ఫౌండర్ మెంబర్‌గా ఉండి అనేక కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యేవారు. సత్తిబాబు సేవలు పొందిన వారు, లబ్ధి పొందిన వారు ఎంతోమంది ఉన్నారు. సత్తిబాబు ఇక లేడంటే మేము జీర్ణించుకోలేకపోతున్నాం.

- అర్జునరావు, చిన్ననాటి మిత్రుడు

సత్తిబాబుగారితో ఉద్యమ ప్రయాణం



నేను 2002-03లో మాకవరపాలెం జెడ్‌పి హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నప్పుడు అనకాపల్లిలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా విద్యా వైజ్ఞానిక తరగతులకు కామ్రేడ్ సత్తిబాబు గారు నన్ను పంపించారు. 2004 నుంచి నర్సీపట్నం ఉద్యమంలో పనిచేస్తున్నాను. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు, శిక్షణా తరగతులు వంటి వాటి నిర్వహణకు సత్తిబాబు గారు సహాయ, సహకారాలు అందించేవారు. ఆఫీసులో మేము వంట చేయకపోతే వారి ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టించేవారు. ఎస్‌ఎఫ్‌ఐ కార్యకర్తలకు ఆఫీసు తరువాత సత్తిబాబు గారి ఇల్లే కేరాఫ్ అడ్రస్‌గా ఉండేది. నేను 2014లో సిఐటియు బాధ్యతలు చేపట్టాక సత్తిబాబు గారు నర్సీపట్నంలోని కార్మికలోకానికి పరిచయం చేశారు. కార్మికుల సమస్యలపై అవగాహన కల్పించారు. పనిలో తోడ్పాటు ఇచ్చేవారు. మున్సిపల్ కార్మికుల వేతన బకాయిల పోరాటంలో కాంట్రాక్టర్లతో, కమిషనర్‌తో జరిగిన చర్చల్లో కార్మికుల కుటుంబ పరిస్థితులు, వడ్డీ వ్యాపారులతో కార్మికులు పడుతున్న అవస్థలను చెప్పి బకాయిలు చెల్లించే వరకు పట్టు పట్టేవారు. ముఠా కార్మికుల కూలి రేట్ల విషయంపై చర్చల ద్వారా సమస్య పరిష్కారానికి కృషి చేసేవారు. మాకవరపాలెం అన్‌రాక్ నిర్వాసితుల పాదయాత్రలోనూ, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాల్లో సమగ్ర అభివృద్ధికి జరిగిన పాదయాత్రలోనూ కీలకపాత్ర పోషించారు. నాతవరం మండలం సరుగుడు లేటరైట్ ఉద్యమంలో సత్తిబాబు గారి పాత్ర మరువలేనిది. ఇళ్ళ స్థలాలు, స్థానిక సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన నిలిచారు.

2015లో తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నా 2016 తరువాత జరిగిన జీడిపిక్కల కార్మికుల సమ్మెలో కార్మికులను ఐక్యపరిచి, సమ్మె జయప్రదానికి కృషి చేశారు. కరోనా, లాక్‌డౌన్ కాలంలో అసంఘటిత, వలస కూలీలను ఆదుకునేందుకు పార్టీ సానుభూతిపరులు, శ్రేయోభిలాషుల సహకారంతో బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర సరుకులు సుమారు నెలరోజుల పాటు పంపిణీ చేశారు.

కొత్తవారికి సిపిఎం సత్తిబాబు అడ్రస్ నేటికీ కేరాఫ్ కృష్ణా బజార్ అని చెబుతారు. ముఠా కార్మికుడు కనిపిస్తే సత్తిబాబు గారు కనబడినట్టే! ఇంత కాలం ఆయనతో ఉద్యమ ప్రయాణం నాకు ఎన్నో అనుభవాలను ఇచ్చింది. ఎత్తిన జెండా, నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకూ నిలబడ్డారు. ఆయన హఠాన్మరణం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. సత్తిబాబు గారి ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు మనమిచ్చే నివాళి.

- అడిగర్ల రాజు,
సిఐటియు, నర్సీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి

మహిళల పట్ల గౌరవ భావం



మధ్యాహ్న భోజన పథకం కార్మికురాలిగా సిఐటియు సంఘంతో నాకు పరిచయం ఏర్పడింది. నాటి నుంచి సత్తిబాబు గారితో నాకు పరిచయం ఉంది. 2012లో నేను సిపిఎం సభ్యత్వం తీసుకున్నాను. అప్పటినుండి సత్తిబాబు గారితో కలిసి అనేక పోరాటాల్లో పాలుపంచుకున్నాను. సంఘం కార్యక్రమాలు తెలియజేసినప్పుడు వినయపూర్వకంగా చెప్పేవారు. ఎటువంటి గర్వం, ఆగ్రహం లేని వ్యక్తి. తన నవ్వుతోనే సమాధానం ఇచ్చేవారు. సమస్య పరిష్కారానికి తోడ్పాటును అందించేవారు. కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆయన ఉత్సాహాన్ని నింపేవారు. మహిళల పట్ల చాలా గౌరవభావంతో ఉండేవారు. మహిళలు సమాజంలో ఆదర్శంగా అభివృద్ధి పథంలో ఉండాలని ఆయన ఆశించేవారు. పార్టీ, సిఐటియు కార్యక్రమాలకు హాజరైన వారు, మహిళల పట్ల చాలా బాధ్యతగా వ్యవహరించేవారు. వారు కార్యక్రమం నుంచి ఇంటికి వెళ్లే క్రమంలో ప్రతి ఒక్కరూ క్షేమంగా చేరాలని పేరుపేరునా తెలియజేసేవారు. మా క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకొని సోదరభావంతో ప్రతి ఒక్కరినీ ఆదరించేవారు. నా కుటుంబం, పిల్లల, భర్త యోగక్షేమాలు అడిగి తెలుసుకునేవారు. నా కుటుంబానికి సహకారాన్ని అందించేవారు. ఎదుట వారితో ఏ విధంగా మాట్లాడాలి, ఏ విధంగా మెలగాలి అనేవి ఆయన నుంచే నేర్చుకున్నాను. ఆయన స్ఫూర్తితోనే నేను కార్మికుల పోరాటాల్లో పాల్గొంటున్నాను.

ఆయన నిత్యం ఆదర్శంగా ఉండేవారు. తన ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా ఆఖరి క్షణం వరకు ఉద్యమానికి అంకితమయ్యారు. సత్తిబాబుగారి ఆశయ సాధన కోసం నేను కృషి చేస్తాను.

- ప్రసన్న,
ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు

తొందరపాటులేని మనిషి



తొలుత యువజన సంఘంలో గ్రామ కమిటీ సభ్యునిగా సత్తిబాబు పని ప్రారంభించారు. ఆయన 17వ ఏట నుంచి భూ సమస్యలపై కలిసి పనిచేశాము. తొలుత పార్టీ సానుభూతిపరునిగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. భూ సమస్యలపై నిర్వహించిన పోరాటాలకు వచ్చేవారు. చట్టప్రకారం దళితులకు భూములు ఇవ్వాలని పోరాటాలు చేశాం. షెడ్యూల్ ఏరియాలో జరిగిన భూ పోరాటాల్లో చురుగ్గా ఉండేవారు. పార్టీ కార్యక్రమాల్లోగానీ, బయటగానీ తొందరపాటు లేకుండా మాట్లాడేవారు. విరోధితో కూడా మంచిగా ఉండేవారు. సహాయం చేయలేనని ముఖమ్మీద చెప్పకుండా, అవకాశమున్నంతవరకు సహాయం అందించేవారు. పార్టీ పట్ల ఎంత విశ్వాసంతో పనిచేశారో, కుటుంబం పట్ల అదే ప్రేమ చూపేవారు. బంధువులతోనూ ఎంతో ఆప్యాయంగా ఉండేవారు.

- సాపిరెడ్డి నారాయణమూర్తి,
ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు,
కెడి.పేట

నన్ను తీర్చిదిద్దింది సత్తిబాబుగారే...



కామ్రేడ్ సత్తిబాబు గారితో నా పరిచయానికి సుమారు 20 ఏళ్ళు. సిపిఎంకి అతి సాధారణ సానుభూతి పరుడనైన నన్ను ఒక నాయకుడిగా తీర్చిదిద్దింది ప్రియమైన నేత సత్తిబాబుగారే. దళిత, గిరిజన, బడుగు బహీనవర్గాల, కార్మికుల సమస్యలపై నిరంతరం జరుగుతున్న పోరాటాల్లో నేను పాల్గొనేలా, వాటికి నాయకత్వం వహించేలా ప్రోత్సహించారు. ఈ ప్రాంత భూ సమస్యలు, సామాజిక సమస్యలపై వెన్నుతట్టి కదిలించారు. రోలుగుంట మండలంలో పార్టీ విస్తరణకు కృషి చేశారు. డప్పు కళాకారులు, గీతకార్మికుల ఇబ్బందులను గుర్తించి, వాటి పరిష్కారానికి సంఘాలు పెట్టించారు. ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, సిఐటియుల ఆధ్వర్యాన సైకిల్, బస్సు యాత్రలు విస్తృతంగా నడిచినప్పుడు... మొబైల్ టీమ్‌లను సత్తిబాబుగారు బాగా నడిపేవారు. గ్రామాల్లో స్కీమ్ వర్కర్లను సమీకరించి యాత్ర బృందాలకు అవసరమైన ఏర్పాట్లు చేసేవారు. బంద్‌లు, సమ్మెలలో పోలీసు దుందుడుకు చర్యలను దీటు ప్రతిఘటించేవారు. కార్యకర్తల అనారోగ్య సమస్యలను దగ్గరుండి వైద్యులకు చూపించేవారు. విశాల కార్మిక, ప్రజా అభిమానం ఉన్న సత్తిబాబుగారు ఇక లేరనే వాస్తవాన్ని నేను జీర్ణించుకోలేక పోతున్నాను. ఆయన ఆశయబాటలో శక్తి వంచనలేకుండా పయనించడమే మనం ఆయనకు ఇవ్వగలిగే నివాళి.

- ఈరెల్లి చిరంజీవి,
కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎర్ర జెండా బాటలోనే...



జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా తను నమ్మిన ఎర్రజెండాను సత్తిబాబు గారు ఎన్నడూ విడిచిపెట్టలేదు. తుదిశ్వాస వరకు నిండైన కామ్రేడుగా జీవించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో, ప్రస్తుత అనకాపల్లి జిల్లాలో అసంఘటిత రంగ కార్మికుల హక్కుల సాధనకు పనిచేశారు. ఎల్లవేళలా కార్మికులకు అందుబాటులో ఉంటూ వారి మన్ననలు పొందారు. నర్సీపట్నం డివిజన్‌లో పలు సంఘాలు నిర్మించి, విస్తరింపజేసి కార్యకర్తలకు మార్గదర్శిగా నిలిచారు. సత్తిబాబుగారి పనిలో అనవసరపు హడావుడి, ఆర్భాటం కనపడవు. ఆయన తన దైన శైలిలో ముందుకు సాగేవారు. ఉమ్మడి జిల్లాలో పలు శిక్షణా శిబిరాలు, సభలు, సమావేశాలు, కార్యక్రమాల్లో మేం కలిసి పాల్గొన్నాం. కేంద్ర బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి ముగింపు సభ నర్సీపట్నంలోనే జరిగింది. సభకు నేను హాజరయ్యాను. కామ్రేడ్ డి సత్తిబాబుతో కలిసి పాల్గొన్న చివరి సభ అదే...

- ఎం.జగ్గునాయుడు,
సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి

మృదు స్వభావి



కామ్రేడ్ డి.సత్తిబాబు గారితో సిఐటియు జిల్లా కమిటీలో ఆఫీస్ బేరర్‌గా కలిసి పనిచేశాం. ఆయనలో ఎప్పుడూ కోపం చూడలేదు. మృదు స్వభావి. అందరినీ ఆప్యాయంగా పలకరించేవారు. నర్సీపట్నం డివిజన్లో కార్మికుల సమస్యలపై ఏ విషయమైనా చర్చించేవారు. ఫోన్ చేసి చెబితే వెంటనే స్పందించేవారు. నర్సీపట్నంలోని అన్ని రంగాల కార్మికుల్లో ఒక్కరై తలలో నాలుకలా కలిసిపోయారు. ఆయన కార్మికులను కలవని రోజు లేదు. ఇటీవల చలో ఢిల్లీకి వెళ్లినప్పుడు ఆయన తీసుకొచ్చిన కార్మికుల్ని వదిలేయకుండా వారిని అంటిపెట్టుకొని ఉన్నారు. పై నుంచి ఏ పిలుపు ఇచ్చినా దానిని అమలు చేయడానికి కృషి చేసేవారు. సత్తిబాబు గారి మరణం నర్సీపట్నం కార్మికోద్యమానికి, సిఐటియు జిల్లా ఉద్యమానికి తీరని లోటు.

- ఆర్.శంకరరావు,
సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు

ప్రజా సమస్యలపై గళమెత్తే నాయకుడు



కామ్రేడ్ డి.సత్తిబాబు మరణం చాలా బాధాకరం. నర్సీపట్నం ప్రాంతంలో అనేక మందికి సుపరిచితుడు. నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తే నాయకుడు. ఆ ప్రాంతంలో పార్టీని, ప్రజా సంఘాలను నిర్మించడంలో ముఖ్య భూమిక పోషించారు. ప్రజలతో నిత్య సంబంధాలుండేవి. అందువల్లనే నర్సీపట్నంలో సిఐటియు ముఖ్య నాయకుడు చనిపోవడంతో ఏర్పడిన గ్యాప్‌ను వెంటనే సత్తిబాబు భర్తీ చేయగలిగారు. ఎప్పుడు పలకరించినా చిరునవ్వే అలంకారం. మేం కలిసి పని చేసిన దాదాపు మూడు దశాబ్దాల కాలంలో ఎన్నడూ ఆయనలో కోపం నేను చూడలేదు. ఆరోగ్యం సహకరించకపోయినా, చివరివరకూ కార్యక్రమాల్లో పాల్గొంటూనే ఉన్నారు.

- ఎ.అజశర్మ,
ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ ఉండేవారు



కామ్రేడ్ సత్తిబాబు చనిపోవడానికి రెండు రోజుల ముందు- ఢిల్లీలో రెజ్లింగ్ క్రీడాకారులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా నర్సీపట్నంలో ఆయనా, మేమూ కలిసి సంతకాల సేకరణ చేశాం. అనంతరం కాఫీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఇంతలోనే ఇలా జరగడం నమ్మశక్యంగా లేదు. సత్తిబాబు గారి వ్యక్తిత్వం చాలా గొప్పది. సహనశీలి. మహిళల పట్ల ఎంతో గౌరవ భావంతో మెలిగేవారు. ఎవరినైనా 'అమ్మా' అని పిలిచేవారు. నమ్రతే కమ్యూనిస్టులకు అభరణం అంటారు. అటువంటి నమ్రతతో సత్తిబాబు గారు నర్సీపట్నంలో అన్ని వర్గాల ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. ఆయన అంతిమయాత్రకు వచ్చిన జనమే అందుకు తార్కాణం.

అమరజీవి కామ్రేడ్ మేకా సూరిబాబు గారి స్ఫూర్తితో ఉద్యమ పాఠాలు నేర్చుకుని నిరాడంబర జీవితం గడిపారు. నిస్వార్థం, నిబద్ధత సత్తిబాబుగారి సొంతం. ఎదుటివారు చేసే విమర్శలను నవ్వుతూ స్వీకరించే గుణం తనది. కార్యకర్తలతో పనిచేయించేటప్పుడు ఏనాడూ ఆయన ముఖంలో మచ్చుకైనా కోపం కనబడేది కాదు. కార్యకర్తల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ ఉండేవారు.

శారద గారిది కమ్యూనిస్టు కుటుంబం కావడంతో ఆమె ఉద్యమానికి, కార్యకర్తలకు అమ్మలాగ అండగా ఉండేవారు. వారిద్దరూ స్నేహితుల్లా మెలిగేవారు. పిల్లలను ఒకరిని డాక్టర్‌గా, మరొకరిని సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా తీర్చిదిద్దారు.

శారద గారు ఎంత అనారోగ్యంగా ఉన్నా సత్తిబాబు గారి తిండి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకునేవారు. ఈతరం కమ్యూనిస్టులు సత్తిబాబుగారిని చూసి నేర్చుకోవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. తను నడిచిన ఆశయ బాటలో పట్టుదలగా పనిచేయడమే ఆయనకు మనమిచ్చే నివాళి.

- బి.ప్రభావతి,
ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు

అనేక బాధ్యతల నాన్న



అందరికీ నమస్కారం.

దుంపలపూడి సత్యనారాయణ (సత్తిబాబు) గారి జీవితాన్ని గౌరవంగా స్మరించుకోవడం మా కర్తవ్యం. ఆయన వృత్తి ప్రవృత్తి రెండూ రెండూ ప్రజాసమస్యలపై పనిచేయటమే! అది మాకెప్పటికీ స్మరణీయం. ఇంకా అందరిలాగే నాన్నలోనూ కొన్ని కోణాలు ఉన్నాయి. కొడుకుగా, స్నేహితుడిగా, అన్నదమ్ముడిగా, ఊరిమనిషిగా, ఇంటిపెద్దగా, బాధ్యత గల భర్తగా, అనుక్షణం పిల్లల బాగు కోరుకునే తండ్రిగా... అన్నిటికీ మించి ఒక మంచి మనసున్న మనిషిగా... నాన్న వ్యక్తిత్వం మాకు ఆదర్శప్రాయం.

నాగాపురం అనే ఒక చిన్న గ్రామం. లచ్చారావు మాస్టారు పేరున్న మనిషి. ఊరి పెద్ద. ఐదుగురి సంతానంలో నాన్న రెండోవాడు. సరదాలూ సంతోషాలతోపాటూ మధ్య తరగతి బాధ్యతలు... ఇంట్లో మనిషులతోనే కాకుండా తాత గారి అన్నదమ్ముల కుటుంబాలతో చక్కటి అనుబంధం. ఊరంతా చుట్టాలనుకునే వాతావరణం. కాస్తో కూస్తో హైస్కూలు చదువు. ఇదీ నాన్న బాల్యం.

కాస్త రెట్టించిన ఉత్సాహంతో సరదా సరదా వ్యవసాయం. కొంచెం కొంచెంగా చుట్టుపక్కల పరిస్థితులను మనుషులను అర్థం చేసుకునే గుణం. తాతగారి ఆచరణలోంచి వచ్చిన నాన్న ఆలోచనలు నలుగురి పట్ల బాధ్యతగా నడిచేలా చేశాయి. ఆ నడక కాస్త కామ్రేడ్ మేకా సూరిబాబు గారి అడుగులో అడుగుగా మారింది. ఆ క్రమంలోనే అమ్మతో వివాహం., తర్వాత నేను, తమ్ముడు పుట్టడం. ఇలా ఇప్పుడు మాదొక కుటుంబం. అయితే, ఈ ప్రయాణం ఒకరిది కాదు; శారదా సత్తిబాబు, గౌరి ఎర్రమనాయుడనే నలుగురిది. మా ఇద్దరితోపాటు ముగ్గురు అక్కలకు కూడా నాన్నే నాన్న. తర్వాత చదువులు, ఇతర అవసరాల రీత్యా అమ్మమ్మగారి ఊరు పాతూరు నుంచి నర్సీపట్నం వచ్చి స్థిరపడ్డాం. అందరం కలిసే ఉంటున్నాం. అమ్మ కుటుంబం, నాన్న కుటుంబం పెద్దవి కావడం వల్ల చుట్టాలకు కొదవలేదు. దానికి తోడు అటు అమ్మ తమ్ముళ్లు, ఇటు నాన్న అన్నదమ్ముల కుటుంబాల వల్ల అన్న, తమ్ముడు, అక్క, చెల్లి, బావ, మరదలు... అనే పిలుపులు ఎప్పుడూ మా చుట్టే ఉండేవి. వీటితోపాటు ఆయనకున్న స్నేహపూర్వక సంబంధాలు సొంత మనుషుల్లా మాకు తోడుండేవి.

ఒక తండ్రికి కొడుకుగా నాన్నంటే నాకు తెలిసింది తక్కువే. కానీ ఈ రోజుకీ నాన్నమ్మ పట్ల బాధ్యతగా ఉండడం, ఆవిడకున్న అవసరాలను గుర్తించి అన్నదమ్ములతో సంప్రదించి ఏం చేయాలో చర్చించడం చేస్తారు.

నాన్న స్నేహం ఒక ప్రవాహం. చిన్నప్పటి నుంచీ ఈ నాటి వరకు చుట్టూ ఉన్న అందరితో ఆయనకు స్నేహమే. రోజువారి పనిచేసుకునే వారి దగ్గరుంచి పెద్దస్థాయి వ్యక్తుల వరకు అందరి బంధువు నాన్న.

అన్నదమ్ముడిగా అందరిలో ఒకడు. సత్తన్నయ్య... సత్తన్న... సత్తిబాబు ఈ పిలుపులు దాదాపు ప్రతి రోజూ అందరి నోట్లో వినిపిస్తాయి. వీరంతా ఓ చోట కలిస్తే... నిమిషాలు గంటలుగా... రోజులుగా కూడా మారిపోతాయి. జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ, అందులోనే కష్టసుఖాలు చర్చించుకుంటూ చాలా సరదాగా గడిపేస్తారు.

ఊరి మనిషి. నిజమే! నాన్న ఊరిమనిషే. ఉండేది నర్సీపట్నంలోనే అయినా... నాగాపురం, పాతూరు నాన్నకు చాలా ఇష్టం. వారానికి రెండుమూడు సార్లయినా ఊరెళ్లాలి. తన వాళ్లందరితో కాసేపు గడపాలి అనుకునే మనిషి. 'ఓ తాతారావు'... 'ఓ సుబ్బారావు' అని పలకరిస్తూ ఆ గాలిని ఆస్వాదించేవారు. చిన్ననాటి స్నేహితులతో చేరితే ఇక చిన్నపిల్లాడే. మాతో పంచుకునేవి కూడా ఎక్కువ శాతం ఊరి కబుర్లే!

ఇంటి పెద్దగా' చాలా బాధ్యతగా ఉండేవారు ఆయన కుటుంబంతోపాటు అమ్మ కుటుంబంతో కూడా. ముఖ్యంగా అన్నదమ్ముల పిల్లలంటే ప్రత్యేకమైన అభిమానం. మా ఎదుగుదలతో పాటు ఆయనకు అందరి ఎదుగుదల ముఖ్యమే. తరచుగా అందరికీ ఫోన్‌చేసి మంచీ చెడూ కనుక్కునేవారు. ఆ దిశగా ఆలోచించే ప్రతిసారీ ఇదంతా నాదే అనుకునేవారు. అదే క్రమంలో మేం కూడా ఉండాలని ఆశించాం. అక్కల పెళ్లిళ్ల విషయంలో నాన్న ఒక ముఖ్య సూత్రధారి. ముఖ్యంగా పెద్దమ్మ, పెదనాన్న అమ్మానాన్న ... అక్కలు బావలు, మా కుటుంబం, తమ్ముడి కుటుంబం, మనవళ్లు మనవరాళ్లు... ఇంత పొందిగ్గా ఒదిగిపోయిన మా బొమ్మరిల్లుకి 'బొమ్మరిల్లు' ఫాదర్ మా నాన్న.

ప్రేమ ... నాన్నలో ప్రేమకు అవధుల్లేవు. అదే అమ్మనీ, నాన్ననీ కలిపింది. ఆ ప్రేమకు కులం కూడా అడ్డురాలేదు. ప్రేమకి అర్థం బాధ్యతలు పంచుకోవడం. ఒకరి అభిప్రాయాన్ని ఒకరు గౌరవించుకోవడం. ఆ విషయంలో అమ్మానాన్న ఒకరికి ఒకరై బతికారు. నీ కుటుంబం నీ మంచిచెడ్డలు నావి... అని ఇద్దరూ అనుకోబట్టే అది సాధ్యమైంది. ముఖ్యంగా నాన్న కోణంలోంచి చూస్తే అమ్మన్నా... అమ్మ మాటన్నా ఆయనకు ఎంతో నమ్మకం. అలాకాదు... ఇలా... అనే మాట కూడా చాలావరకు సున్నితమైన వ్యక్తీకరణే. అవి మా జీవితాలను కూడా చాలావరకు ప్రభావితం చేశాయి. అమ్మ కూడా ఆయనకు నచ్చిన విధంగా ఇంటి వాతావరణాన్ని ఉంచడంలో పూర్తిగా సఫలమైంది. ఆ రకంగా నాన్న 'బాధ్యత గల భర్త.'.

నాన్న పాత్రలో ఒదిగిపోయిన మా నాన్న మాకెంతో ఇచ్చారు. చదువు, సంస్కారం, సాధించాలనే ఆశ, బతకాలన్న బలం... ఇంకా చాలా. చిన్నతనం నుంచీ చూసుకుంటే 'నాన్న ఒక వండర్'. మాకున్న చిన్న ప్రపంచంలో మాకు తెలియని ఎన్నో విషయాలు చెప్పారు. జ్వరం వచ్చి హాస్పిటల్లో చేరాల్సి వచ్చినప్పుడు అందించిన జీతాన్నంతా అలా ఖర్చు పెట్టేసిన నాన్న కష్టం నాకింకా గుర్తుంది. నాన్నకోసం సాయంత్రం దాకా ఎదురుచూసి, వచ్చాక చుట్టూ చేరి పడుకునేదాకా కబుర్లు... మమ్మల్ని నవ్వించడం కోసం నాన్న మరీ చిన్న పిల్లాడు అయిపోయేవారు. ఆలోచనలకు తగ్గట్టుగానే మమ్మల్ని పెంచుకున్నారు. ఏ రోజూ మార్కులు తక్కువ వచ్చాయని నిందించలేదు. మంచి సంస్కారం ఉంటే అవకాశాలవే వస్తాయని ధైర్యం చెప్పేవారు.

నాన్న నేర్పించిన మొదటిపాట 'తెలుగువీర లేవరా... దీక్షబూని సాగరా'. స్కూల్ డ్రాయింగ్ పోటీల్లో నాతో వేయించిన మొదటి చిత్రం జాతీయ జెండా. ఉత్తరాలు రాయించేవారు. పేపర్లో మా పేర్లు పడినప్పుడు పొంగిపోయేవారు. ఇష్టమైన హీరో ఎవరంటే బ్రహ్మానందం అనేవారు. ఇష్టమైన సినిమా 'అహ నా పెళ్లంట'. తెలుగు సినిమా వజ్రోత్సవాలు చాలా ఆసక్తిగా చూశారు. కారులో ముందు సీటు కోసం పోటీపడే నాన్నని చూస్తే నవ్వొచ్చేది. అమ్మకు ఆరోగ్యం బాగో లేనప్పుడు రాత్రంతా దగ్గరుండి చూసుకునేవారు. తమ్ముడు డాక్టర్ అయినప్పుడు ఆయన సంతోషంతో కూడిన గర్వాన్ని చూశాను. మా చదువులు, పెళ్లిళ్లు అన్నింటా మా ఇష్టాన్ని గౌరవించారు. చిన్నప్పుడే కాదు; ఇప్పటికి కూడా ఇదీ సమస్య అని ఏ రోజూ చెప్పేవారు కాదు. ఇలా మా జీవితంలో ప్రతి మలుపులో నాన్న ఉన్నారు. ఏదో సినిమాలో చెప్పినట్టు బతకడానికి గాలి, నీరు, తిండి అవసరం లేదట... ధైర్యం ఉంటే చాలట. అలాంటి ధైర్యాన్ని మా జీవితాలకు సరిపడేంత ఇచ్చారు. అన్నీ ఇచ్చి ఏదీ తీసుకోకుండానే మా నుంచి దూరమయ్యారు.

- అమర్, పెద్ద కుమారుడు.

విలువలు వదలని మనిషి



విలువలు వదలని సాధారణ మధ్య తరగతి మనిషి మా నాన్న. నిస్వార్థం, త్యాగం ఆయన ఆభరణాలు. మొహమాటస్తులు. ఎవ్వరికీ 'కాదు, లేదు' అని చెప్పలేక సతమతమైన సందర్భాలెన్నో! చిన్నప్పుడు నాన్న దగ్గర మా ఎన్నెన్నో ప్రశ్నలకు మర్యాదపూర్వక సంపూర్ణ సమాధానం లభించేది. తెలియని విషయం 'నాకు తెలీదు' అని చిన్నపిల్లవాడికి కూడా చెప్పగలిగేంత నిజాయితీ ఆయనది. నాన్న సాయంత్రం ఇంటికి చేరుకునే సమయానికి మేం నలుగురం (పెద్ద నాన్న గారి పిల్లలు అక్కలతో సహా మేం నలుగురం) ఆయన కోసం కాచుక్కూర్చునే వాళ్లం. నాన్న చేసే అల్లరికి మేం కూడా తోడవ్వొచ్చు కదా అని.

మా రెండు కుటుంబాలు ఉమ్మడిగా కలిసి ఉండడంలో నాన్న, పెద్ద నాన్న పాత్ర చాలా కీలకం. మా నలుగురి వ్యక్తిత్వ వికాసం కోసం నాన్న అందించిన మాటలు, చేతలు మాకు సదా స్మరణీయం. కమ్యూనిజం అంటే రాజకీయం మాత్రమే కాదు. అది ఒక జీవనశైలి అని నేను అర్థం చేసుకోవడానికి మా నాన్న నడవడికే కారణం. వ్యవసాయమన్నా... సాగు చేసే రైతన్నన్నా నాన్నకు చాలా ఇష్టం. అభిమానం. నాన్న నిరాడంబరుడు. చిరిగిన బనియన్లు, కుట్టించుకున్న చెప్పులు ... ఇలాగే ఎక్కువ కాలం నాన్నని చూశాను.

కీలక సమయంలో తెగించి కాగడా పట్టుకొని మొదట నడిచిన వ్యక్తి నాన్న. అది తను ఎంచుకున్న ప్రజా రాజకీయమైనా, కులాంతర వివాహమైనా. ఆ దారిలో ఎన్నో అడ్డంకులూ, అవమానాలు. వాటిని భరించి అడుగేయడం అంత సులువేమీ కాదు. అది కదా నిజమైన విప్లవమంటే. అది కదా నిజమైన మార్పు అంటే. చివరికి ఆ అరుణ రాస్తానే సరియైన చౌరాస్తాకి చేరుస్తుందని కాలం రుజువు చేసింది.

నాన్నకు కొత్త ప్రదేశాలు చూడడమంటే ఆసక్తి. మన మన్యం, భూగోళంలోని కొండలు, పచ్చదనం, గిరిజనం... అంటే ఆయనకు చాలా ఇష్టం. చైనా వెళ్లడం ఆయన తీరని కోరిక. ప్రస్తుతం నేను కేరళలో పనిచేస్తున్నందున ఆయన కేరళ పర్యటనకు రావలసి ఉంది. ఇంతలోనే ఇలా జరిగింది. కేరళలోని అరుణకాంతులు చూడాలని ఉందన్న నాన్న కోరిక తీరనేలేదు. చివరిరోజు జరిగిన విషాద ఘటనలో నాన్నకు సరైన చికిత్స అందించగలిగే అవకాశం దొరకలేదని తల్లడిల్లిపోయాను. ఇకపై నాన్నంటే ఒక జ్ఞాపకం మాత్రమే అనే నిజం గుండెను పిండేస్తోంది. సెలవు.

- అజయ్, చిన్న కుమారుడు.

మంచి రాజకీయ మిత్రుడు



మేం కుటుంబ సభ్యులం అనేకంటే రాజకీయ మిత్రులం అనడం సబబు. నాన్నగారు హత్యకు గురైన తర్వాత మా కుటుంబం అనేక ఆటుపోట్లకు గురైంది. ఈ క్రమంలో నేను సుమారు పదేళ్ల పాటు రాజకీయ శూన్యతలోనే ఉండిపోయాను. నాన్న దగ్గర నేర్చుకున్నదీ, కమ్యూనిస్టు పార్టీలో నేను తెలుసుకున్నదీ, మా ఉత్సాహం, ఉత్తేజం అంతా వృథానేనా అనే ఆలోచన నన్ను తీవ్ర వేదనకు గురిచేసేది. అప్పట్లో కొంతమంది కార్యకర్తలది కూడా బహుశా ఇదే పరిస్థితి అయి ఉండొచ్చు. అందులో సత్తిబాబు ఒక్కడు. సత్తిబాబు పుస్తకాలు బాగా చదివేవాడు. చదివింది మా వద్ద చర్చకు పెట్టేవాడు. నాయుడు గారు, నేను, సత్తిబాబు ముగ్గురం సైద్ధాంతిక విషయాలు చర్చించేవాళ్లం. నిరాశలో ఉన్న మమ్మల్ని 'మీరు ఎర్రజెండాపై విశ్వాసాన్ని వదులుకోనవసరం లేదు. మీ నాన్నగారి త్యాగాన్ని మనం వృథా కానివ్వొద్దు' అని ధైర్యం చెప్పేవాడు. సిపిఎం నాయకులు రాజేంద్ర ప్రసాద్‌గారితో ఎక్కువగా చర్చించేవాడు. "కష్టజీవులకు సేదతీర్చేది ఎర్రజెండా నీడే. ఆ మార్గాన నడుస్తున్న సిపిఎంలో మనం కలిసి పనిచేద్దాం" అనేవాడు. తర్జనభర్జన తరువాత ... కచ్చితమైన విధాన స్పష్టతతో మేం సిపిఎంలో చేరాం. కలిసికట్టుగా పనిచేశాం. సత్తిబాబుకు నేనన్నా, నా మాటన్నా... అపారమైన గౌరవం. నాయుడు గారిని ఏ స్థాయిలోనైనా ఆయన గౌరవించాడో నా పట్ల అంతే గౌరవప్రదంగా నడుచుకున్నాడు. సత్తిబాబు లేని లోటు కార్మికోద్యమానికి, మా కుటుంబానికీ పూడ్చలేనిది.

- గౌరి, సత్తిబాబు గారి వదిన



భార్య శారద, కుమారులు, కోడళ్లు అజయ్, శ్రావ్య, అమర్, శాంతిలతో సత్తిబాబు

ఏదైనా చిరునవ్వుతో చెప్పేవారు



పెద నాన్న నాకు మంచి మిత్రుడు. ఆయన తన చిన్ననాటి జ్ఞాపకాలను, నాగాపురంలో తన మిత్రులతో కలిసి మెలిసి చేసే పనులను చాలా ఛలోక్తులతో హాస్యంగా వర్ణించేవారు. తాతయ్య, నాన్నమ్మలకు సహాయం చేసే పనులు గురించి చెప్పేవారు. మధ్య తరగతి బంధాలు గురించి చెబుతూ మధ్య తరగతి వాళ్లకు కుటుంబమే ఆస్తి అనేవారు. ఏ విషయమైనా చిరునవ్వుతో చెప్పేవారు. అందరినీ ఆప్యాయంగా పలకరించే మనిషి. మా ఊరిలో మొదలైతే అందరినీ నవ్వుతూ పలకరిస్తూ ఇంటికి చేరేవారు. ఆయనది చెరగని చిరునవ్వు. ఆయన జ్ఞాపకాలు మా మదిలో మెదులుతూనే ఉన్నాయి. ఆయన లేరంటే నమ్మడం కష్టంగా ఉంది.

- నందు, సత్తిబాబు తమ్ముడి కుమారుడు

చిన్నబావ మాటంటే నమ్మకం, గౌరవం



మా చిన్నబావ మాటంటే మాకు నమ్మకం. గౌరవం. అంతకు మించి ఆయన మాకు మంచి దోస్త్. ఎప్పుడూ 'హాయ్ కామ్రేడ్...' అని పిలుచుకునే వాళ్లం. ఆయన చలోక్తులు, సమయస్ఫూర్తితో కూడిన హాస్యం కడుపుబ్బా నవ్వించేవి. విధానాలు ఏవైనా సంప్రదాయాలు పాటించే మనుషులనూ, వారి అభిప్రాయాలను సైతం సత్తిబాబు బావ గౌరవించడం నాకు బాగా నచ్చేది. నాన్న చనిపోయాక కుటుంబ పరంగా బావ తోడ్పాటు మాకు ధైర్యాన్నిచ్చింది. ఇంత ఆదరణ, మన్నన పొందేలా మచ్చలేని ప్రజా జీవితం గడిపిన అక్కా బావల గమనం మాకు నిజంగా గర్వకారణం.

- మేకా వెంకట మాధవరావు, బావమరిది.

కార్యదీక్షాపరుడు సత్తిబాబు

(మొదటి పేజీ తరువాయి..)

విస్తరించడానికి సత్తిబాబు కేంద్రబిందువుగా వున్నారు. ఉద్యమ విస్తరణకు తమశక్తినంతా ఒడ్డారు. సత్తిబాబు, త్రిమూర్తులురెడ్డి ఇళ్లు 30 సంవత్సరాలపాటు ఉద్యమ కేంద్రాలుగా వున్నాయి. పార్టీ కార్యకలాపాలకు చిరునామాగా వుండేవి. అడుగూ అడుగూ ముందుకేసుకుంటూ, ప్రతికూల పరిస్థితులను తట్టుకొంటూ, ఉద్యమాన్ని విస్తరించుకుంటూ కార్మిక, కష్టజీవుల ఉద్యమాల్ని నిరవధికంగా నడిపారు. ప్రజా సమస్యలపై సత్తిబాబు వెంటనే స్పందించేవారు. పార్టీ పిలుపులను చిత్తశుద్ధితో అమలు చేశారు. అనారోగ్య, ఆర్థిక సమస్యలొచ్చిన సందర్భంలోనూ ఆయన ఏనాడూ వెనక్కుతగ్గలేదు. పోరాట పంథా వీడలేదు. ఊగిసలాడలేదు. నిరాశ, అలసట, అసహనం ప్రదర్శించలేదు. కష్టజీవుల కోసం చిత్తశుద్ధితో పనిచేయడమే ఆయనకు తెలుసు. చేతికి సంచి తగిలించుకొని, చిరునవ్వుతో కార్యకర్తలు, పరిచయస్తులను పలకరించుకొని ప్రజాసమస్యలపై పనిచేయడం ఆయనకొక దినచర్యగా మారింది. నాన్‌షెడ్యూల్ మండలాల్లోని గిరిజనుల సమస్యలపై నిర్వహించిన పాదయాత్రలో సత్తిబాబు ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. బాక్సైట్, చింతపల్లి కాఫీ కార్మికుల ఉద్యమాలకు నర్సీపట్నం కేంద్రంగా వున్న కాలంలో ఆయన విశేష కృషి చేశారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా అత్యంత నిబద్ధతతో చేసేవారు.

1997లో నర్సీపట్నంలో డివైఎఫ్ఐ రాష్ట్ర రాజకీయ తరగతుల నిర్వహణలో ఆయన పాత్ర మరువలేనిది. నర్సీపట్నం డివిజన్ సిఐటియు ప్రధాన కార్యదర్శిగా కొంతకాలం పనిచేశారు. సిఐటియు డివిజన్ అధ్యక్షులుగా బాధ్యతల్లో వున్నారు. గొలుగొండ, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట, నాతవరం మండలాల్లో పార్టీ, కార్మిక సంఘాల విస్తరణకు కృషి చేశారు. మైదాన ప్రాంత గిరిజనులకు పట్టాల మంజూరు కోసం జరిగిన పోరాటంలో చురుగ్గా వ్యవహరించారు. ఓలం జీడి పిక్కల పరిశ్రమ కార్మికుల సమస్యలపై రెండు నెలలపాటు నిర్వహించిన సమ్మెకు నాయకత్వం వహించారు. మాకవరపాలెంలోని అన్‌రాక్ అల్యూమినియం పరిశ్రమలో భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపారు. ఆ సమయంలో ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడంతో సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావుతో కలిసి సత్తిబాబు ఏడు రోజులపాటు నర్సీపట్నం సబ్ జైల్లో వున్నారు. నర్సీపట్నం ప్రాంతంలోని జీడిపిక్కల పరిశ్రమల్లో అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్న మహిళలను సంఘటితం చేసి దాదాపు రెండు నెలలు జరిగిన సమ్మెను ముందుండి నడిపారు. పంచాయతీ, మున్సిపల్, కాఫీ, భవన నిర్మాణ కార్మికులు, ఆటో, తోపుడు బళ్లు, జీడి పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు, వారి కుటుంబాలతో సన్నిహిత సంబంధాలు కల్గివుండేవారు.

తండ్రి ఉపాధ్యాయుడు కావడంతో ఉన్నత చదువులు చదువుకొని, అత్యున్నతమైన జీవితాన్ని గడిపే అవకాశాలున్నప్పటికీ, వాటినికాదనుకొని, వదులుకొని కష్టజీవుల కోసం పనిచేయడం తన జీవితమార్గంగా ఎంచుకున్నారు. చనిపోయిన రోజు (2023 మే 20న) ఉదయం కూడా ఉపాధి కార్మికుల సమస్యలపై పని ప్రాంతానికి వెళ్లొచ్చారు. ప్రజాశక్తి సర్క్యులేషన్ క్యాంపెయిన్ విషయంపై సంబంధిత బాధ్యులతో ఏర్పాటు చేసిన సమావేశానికి వెళ్తూ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించారు. సత్తిబాబుకు భార్య శారద, కుమారులు అమర్‌బాబు, డాక్టర్ అజయ్‌బాబు వున్నారు.

నిఖార్సైన కమ్యూనిస్టు సత్తిబాబు



విప్లవ జ్యోతి అల్లూరి నడయాడిన నేలపైన ఉదయించిన ఉద్యమ కిరణం సత్తిబాబు. ఉద్యమాలే ఊపిరిగా ఆయన బతికారు. చెరగని చిరునవ్వుతో.. చెప్పలేనంత ప్రేమతో అందరితో మెలిగేవారు. కృష్ణదేవి పేట కేంద్రంగా కమ్యూనిస్ట్ ఉద్యమాన్ని నిర్మించి నలుదిశలా నడిపించిన కమ్యూనిస్టు నాయకులు మేకా సూరిబాబు బాటలో సత్తిబాబు జీవితాంతం నడిచారు. నిజాయితీ, నిరాడంబరత, మృధు స్వభావం ఆయన సొంతం. సిద్ధాంత బలం ఉన్న వ్యక్తి. అహంకారం ఎరుగని మనిషి. సాటి మనిషికి సాయపడే గొప్ప గుణం ఆయనది. ఉద్యమ సహచరులను కుటుంబంగా భావించే వ్యక్తి. నిఖార్సైన కమ్యూనిస్ట్. అవినీతి, అన్యాయం, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన వ్యక్తి. నర్సీపట్నం కేంద్రంగా అనేక ఉద్యమాలు నడిపారు. కుమారుల పేర్లు అమర్, అజయ్ అని పెట్టడంలో ఆయన ఆలోచనా విధానం అర్థమవుతుంది. బహుశా తాను శ్వాసించే ఈ ఉద్యమం ఎప్పటికీ ఆగనిదని, అజేయమైనదని భావించి ఆ పేర్లు పెట్టి ఉండొచ్చు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఉద్యమంలో ముందుకే సాగారు. కాలిబాటనే ఊరూవాడా కలియదిరిగారు. కలిసి వచ్చే ఉద్యమ సహచరుల తోడుతో ముందుకు సాగారు. పోరు బాటలోనే అమరులయ్యారు. ఆయన త్యాగం మరువలేనిది. ఆయన బాటలోనే మేం నడుస్తాం. జోహార్ కామ్రేడ్.. జోహార్..జోహార్.

- ఎం.చిట్టియ్య, యుటిఎఫ్ నర్సీపట్నం డివిజన్ నాయకులు